డిప్యూటేషన్ టీచర్లు వెనక్కి...

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పని సర్దుబాటుపై ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులు వెనక్కి రావాలని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన డిప్యూటేషన్ ఉత్తర్వులు రద్దు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఇప్పటివరకూ పనిచేసే పాఠశాలల నుంచి మంగళవారం రిలీవ్ అయి బుధవారం ఒరిజినల్ పోస్టింగ్ పొందిన పాఠశాలలో రిపోర్టు చేయాలన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

సుమారు ఏడేళ్ల తరువాత డీఎస్సీ నోటిఫికేషన్

- అభ్యర్థుల్లో ఆనందం
- మాట నిలబెట్టుకున్నారంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై ప్రశంసలు
- 2018లో చివరిసారిగా టీడీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నోటిఫికేషన్
- మళ్లీ ఇప్పుడు...



విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):

సుమారు ఏడేళ్ల తరువాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో అభ్యర్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ...ఆ హామీని నెరవేర్చడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని గత ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే అధికారంలోకి వచ్చిన తరువాత డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సంతకం చేశారు. వెంటనే నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమైనప్పటికీ ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన అంశం తెరపైకి రావడంతో కాస్త జాప్యం జరిగింది. ఎట్టకేలకు 16,347 పోస్టులతో ఆదివారం నోటిఫికేషన్ విడుదలైంది.

- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో భారీగా పోటీ
- నిరుద్యోగ ఉపాధ్యాయులు సుమారు 35 వేల మంది ఉండవచ్చునని అంచనా

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నో ఏళ్ల నుంచి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న తమకు మోక్షం కలిగిందని, భారీగా పోస్టులను ప్రకటించడం వల్ల ఉద్యోగాన్ని పొందేందుకు అవకాశం ఉందని రాజేశ్ అనే అభ్యర్థి పేర్కొన్నాడు. గడిచిన ఎనిమిదేళ్ల నుంచి శిక్షణలోనే ఉన్నానని, నోటిఫికేషన్ కోసం ఎదురు చూసి కళ్లు కాయలు కాశాయని, ఎట్టకేలకు తమ ఆకాంక్షలు నెరవేరే రోజు ఆసన్నమైందని ఆనందాన్ని వ్యక్తం చేశాడు. నిరుద్యోగుల ఇబ్బందులు, కష్టాలను గుర్తించిన ఏకైక సీఎం చంద్రబాబునాయుడు అని, గతంలో కూడా టీడీపీ ప్రభుత్వ హయాం (2018)లోనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని, మళ్లీ ఇప్పుడు ఆయన హయాంలోనే నోటిఫికేషన్ విడుదల చేశారని శాంతి అనే యువతి ఆనందాన్ని వ్యక్తంచేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడం ఆనందంగా ఉందంది. నోటిఫికేషన్‌కు, పరీక్షకు మధ్య కాల వ్యవధి కొంత తక్కువగా ఉందని, అయినప్పటికీ పోస్టులను భర్తీచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం ఆనందంగా ఉందని పాడేరు ప్రాంతానికి చెందిన కె.నవీన తెలిపారు. తమ ఇబ్బందులను ఈ ప్రభుత్వమైనా గుర్తించి నందుకు ఆనందంగా ఉందన్నారు. చదివిన చదువుకు అనుగుణమైన ఉద్యోగాన్ని సాధించలేక ఎన్నో కష్టాలు పడ్డామని, ఇప్పటికి తమ కల నెరవేరే రోజు వచ్చిందని సవర చిట్టెమ్మ అనే అభ్యర్థిని ఆనందాన్ని వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో హడావిడిగా తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారని, అయినా అది ముందుకు సాగలేదని... ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా పోస్టుల సంఖ్యను ... మిగతా 6వ పేజీలో

వేలాది మంది అభ్యర్థుల కల నెరవేరింది

– మామిడి శ్రీగౌరి, డీఎస్సీ అభ్యర్థిని



2015లో బీఈడీ పూర్తయింది. 2018లో తొలిసారి డీఎస్సీ రాశాను. అప్పటినుంచి...అంటే ఏడేళ్ల నుంచి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నా. ఇప్పటికైనా ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈసారి పోటీ గట్టిగా ఉంటుంది. అభ్యర్థులు భారీగా ఉన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పోస్టుల సంఖ్య మరికాస్త పెంచితే బాగుండేది. ఏదిఏమైనా నోటిఫికేషన్ రాకతో ఉపాధ్యాయ అభ్యర్థులు కల నెరవేరినట్టు అయింది.

ఆరేళ్ల నుంచి ప్రిపేరవుతున్నా

– కె.కాంతారావు, డీఎస్సీ అభ్యర్థి



డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా అని ఆరేళ్ల నుంచి ఎదురుచూస్తున్నా. ఇంటికి దూరంగా రూమ్‌లో ఉంటూ ప్రిపేరవుతున్నా. ప్రతినెలా కనీసం మూడు వేల నుంచి నాలుగు వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎంతో నమ్మకంతో చదివిస్తున్నారు. వారి నమ్మకాన్ని నిజం చేసేందుకు కష్టపడుతున్నా. ఈ తరుణంలో నోటిఫికేషన్ రావడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు.

భళా ఈపీడీసీఎల్!

విద్యుత్ పొదుపునకు... స్వయం సమృద్ధికి నమూనాగా సూపర్ ఈసీబీసీ భవనం



పూర్తయిన ఈపీడీసీఎల్ భవనం



ఏసీసీ ఇటుకల మధ్య పెట్టిన ఊలు

- ప్రమాణాల మేరకు అధునాతన నిర్మాణం
- స్టార్ హోటల్‌కు రెండు అంతస్థులు లీజు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విద్యుత్ పంపిణీ సంస్థే విద్యుత్ ఆదాపై దృష్టి పెడితే ఎలా ఉంటుంది?...అది అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. మార్గదర్శకంగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) అదే పనిచేసింది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఏలూరు వరకు విస్తరించిన ఈ సంస్థ ఉద్యోగుల శిక్షణ కోసం అధునాతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

పగలు విద్యుద్దీపాల అవసరం లేకుండా, ఏసీ వినియోగానికి తక్కువ విద్యుత్ అయ్యేలా మొత్తంగా చూసుకుంటే 50 శాతం విద్యుత్ ఆదా జరిగేలా భవనం నిర్మించింది. దీనికి బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) నిబంధనలను అనుసరించింది. వారు సూచించిన విధంగా సూపర్ ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)తో భవనం నిర్మించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం తరపున రూ.5 కోట్లు గ్రాంటు వచ్చింది. ఈ నిధులు వెనక్కి ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇంకో రూ.8.5 కోట్లు వెచ్చించి మొత్తం రూ.13.5 కోట్లతో గ్రౌండ్+రెండు అంతస్థుల భవనాన్ని విశాఖ సాగర్ నగర్‌లో నిర్మించింది. దీనికి నాలుగు ప్రమాణాలు పాటించింది.



నిర్మాణానికి ఉపయోగించిన ఏసీసీ ఇటుకలు

ఇవీ ప్రత్యేకతలు

- భవన నిర్మాణానికి కేవిట్ వాల్స్ నిర్మించారు. ఇందుకోసం సిమెంట్ ఇటుకలను పోలి ఉండే ఆటోక్లేవ్డ్ ఏరియేటెడ్ కాంక్రీట్ (ఏసీసీ) ఇటుకలు ఉపయోగించారు. కేవిటీ వాల్స్ మధ్య వేడిని నియంత్రించడానికి ఊలు, థర్మోకోల్ వాడారు. దీని వల్ల బయట వేడి లోపలకు రావడం చాలా వరకు తగ్గిపోతుంది.
- పైకప్పు నుంచి వేడి కిందికి రాకుండా డబుల్ సీలింగ్ వేసి, సిల్వర్ ఫాయిల్‌తో పైకప్పును మూయించారు. ఇది కూడా వేడిని, విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తుంది.
- గోడలు, కిటికీలను నిర్దేశిత నిష్పత్తి ప్రకారం నిర్మించారు. కిటికీలకు డబుల్ గ్లేజ్డ్ అద్దాలు వాడారు. ఇది పూర్తి వెలుతురు అందిస్తూ వేడిని నియంత్రిస్తుంది.
- అన్ని భవనాల్లో ఎన్ని ఏసీలు ఉంటే బయట వాటికి అన్ని అవుట్ డోర్ యూనిట్లు ఉంటాయి. కానీ ఇక్కడ ఒకే ఒక్క అవుట్ డోర్ యూనిట్ ఏర్పాటుచేసి, దానికే అన్ని ఏసీలను అనుసంధానించారు. అంతే కాకుండా లోపల ఉన్న వారికి తగినట్టుగా ఆ గది ఉష్ణోగ్రతకు తగ్గట్టుగా మార్పులు చేసుకునేలా ఏర్పాటు చేశారు. ఇలా చేయడం వల్ల భవనం వినియోగంలో 50 శాతం విద్యుత్ ఆదా అవుతోంది.

లీజుకు రెండు అంతస్థులు

ఎకరాన్నర విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే శిక్షణకు ఉపయోగించుకోవాలని, మిగిలిన పై రెండు అంతస్థులు అద్దెకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏ ద్వారా టెండర్లు ఆహ్వానించారు. 'లెమన్ ట్రీ' సంస్థ స్టార్ హోటల్ నిర్వహణకు ముందుకువచ్చింది. చదరపు అడుగు లెక్కన అద్దె కోట్ చేసింది. దాని ద్వారా మంచి ఆదాయమే వస్తుందని నిర్ణయించుకున్న అధికారులు ఆ సంస్థకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే...గ్రౌండ్ ఫ్లోర్ నిర్వహణకు అయ్యే వ్యయం కూడా లీజుదారులే భరించడానికి ముందుకువచ్చారు. ఫలితంగా ఈపీడీసీఎల్‌కు నిర్వహణ వ్యయం (సిబ్బంది తప్ప) తప్పింది.

స్వయం సమృద్ధి మోడల్

– పృథ్వీ తేజ్, సీఎండీ, ఈపీడీసీఎల్



ఈ భవనం పూర్తిగా స్వయం సమృద్ధి మోడల్‌లో నడుస్తుంది. భవనం నిర్వహణకు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. తిరిగి ఆదాయం రూ.కోట్లలో వస్తుంది.ఈసీబీసీలో సోలార్ పవర్ తప్పనిసరి కావడంతో 15 కేవీ సోలార్ ప్లాంటు పెట్టాం. ఇరుగుపొరుగు రాష్ట్రాలకు ఇది నమూనాగా నిలుస్తుంది.

తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

- గత ఏడాది కంటే రూ.13 కోట్లు మైనస్
- ఇప్పుడు అన్ని చోట్ల స్లాట్ బుకింగ్ ద్వారానే రిజిస్ట్రేషన్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో రియల్ ఎస్టేట్ 'భూ'మ్ తగ్గుముఖం పట్టింది. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం పదేపదే ప్రకటనలు చేయడంతో భూముల ధరలు గణనీయంగా పెరిగిపోయాయి. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ భూములు కొనుగోలు చేయడం వల్ల ధరలు రెట్టింపు అయ్యాయి.


రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం ఒక్కసారిగా ఎగబాకింది. అప్పటివరకూ ఏడాదికి రూ.500 కోట్లు ఆదాయం వస్తే గొప్ప అనుకునే విశాఖ జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖకు 2019-20 ఆర్థిక సంవత్సరంలో కరోనా కారణంగా 40 రోజులు కార్యాలయాలు మూసేసినా రూ.595.57 కోట్లు వచ్చింది. ఆ మరుసటి ఏడాది (2020-21)లో రూ.60 కోట్లు పెరిగి రూ.654.24 కోట్లకు చేరింది. 2021-22లో ఏకంగా రూ.200 కోట్లు పెరిగి రూ.859.89 కోట్లు వచ్చింది. ఆ తరువాత 2022-23 ఆర్థిక సంవత్సరంలో కూడా రూ.815.81 కోట్ల ఆదాయం సమకూరింది. 2023-24లో మరో రూ.200 కోట్లు పెరిగి ఏకంగా వేయి కోట్ల మార్కును దాటేసి రూ.1,060.03 కోట్ల రికార్డు స్థాయి ఆదాయం నమోదుచేసింది. రాష్ట్రంలో ... మిగతా 6వ పేజీలో



కార్యాలయాల వారీగా సాధించిన ఆదాయం

కార్యాలయం	2021-2022	2022-2023	2023-2024	2024-2025
ఆనందపురం	రూ.56.06 కోట్లు	రూ.58.67 కోట్లు	రూ.58.78 కోట్లు	రూ.62.75 కోట్లు
భీమునిపట్నం	రూ.66.53 కోట్లు	రూ.56.64 కోట్లు	రూ.68.38 కోట్లు	రూ.56.07 కోట్లు
ద్వారకానగర్	రూ.89.31 కోట్లు	రూ.94.11 కోట్లు	రూ.109.14 కోట్లు	రూ.111.8 కోట్లు
గాజువాక	రూ.70.6 కోట్లు	రూ.73.73 కోట్లు	రూ.112.93 కోట్లు	రూ.90.61 కోట్లు
గోపాలపట్నం	రూ.47.31 కోట్లు	రూ.49.22 కోట్లు	రూ. 57.16 కోట్లు	రూ.50.91 కోట్లు
మధురవాడ	రూ.243.06 కోట్లు	రూ.218.05 కోట్లు	రూ.237.89 కోట్లు	రూ.249.87 కోట్లు
పెందుర్తి	రూ.83.39 కోట్లు	రూ.69.87 కోట్లు	రూ. 73.37 కోట్లు	రూ.76.3 కోట్లు
విశాఖ ఆర్‌ఓ	రూ.203.63 కోట్లు	రూ.195.52 కోట్లు	రూ.252.31 కోట్లు	రూ.262.09 కోట్లు
పెదగంట్యాడ	----	----	రూ. 90.07 కోట్లు	రూ.87.33 కోట్లు

26, 29 తేదీల్లో నగరానికి ముఖ్యమంత్రి



విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 26న ఒకసారి, 29న మరొకసారి నగరానికి రానున్నారు. 26వ తేదీన ఆయన విశాఖపట్నం వచ్చి, హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా వెళతారు. అక్కడ 'మత్స్యకార భరోసా' పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. లబ్ధిదారులకు చెక్‌లు అందజేస్తారు. కార్యక్రమం ముగిసిన తరువాత తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడ నుంచి విజయవాడ వెళతారు. అలాగే ఈనెల 29వ తేదీ రాత్రి సతీసమేతంగా సీఎం నగరానికి రానున్నారు. ఈనెల 30వ తేదీన సింహాచలం వరాహనరసింహస్వామి చందనోత్సవం సందర్భంగా స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

వీఎంఆర్‌డీఏ ఈ-వేలంపై పెదవివిరుపు

- పాటదారుల సమాచారాన్ని సిబ్బంది లీక్ చేస్తున్నట్టు అనుమానం
- ఫోన్లు చేసి పోటీదారుల బెదిరింపులు
- అందుకే అప్‌సెట్ ధరపై ఎక్కువ రేటు రావడం లేదనే ఆరోపణలు



- ప్లాట్లకు తగ్గుతున్న దరఖాస్తులు
- పాత విధానంలో ప్రత్యక్షంగా నిర్వహించాలని యోచన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఇళ్ల స్థలాలు, అపార్టుమెంట్లలో ఫ్లాట్లకు నిర్వహిస్తున్న ఈ-వేలంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇది అందరికీ అనుకూలంగా లేదని, కొందరికీ లాభదాయకంగా ఉందని చెబుతున్నారు.

గతంలో ఏదైనా స్థలం వేలం వేయాలంటే వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ప్రత్యక్షంగా వేలం నిర్వహించి ఎవరు ఎక్కువకు పాడితే వారికే విక్రయించేది. అయితే కొత్తగా వేసిన లేఅవుట్లలో ప్లాట్లకు వేలం నిర్వహించినప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొని, ఆ చుట్టుపక్కల గల వారి లేఅవుట్ల ధరలు పెంచుకునేందుకు ఒకటి, రెండు ప్లాట్లు మాత్రం ఎక్కువకు పాడేవారు. మిగిలిన ప్లాట్ల వేలంలో పాల్గొనేవారు కాదు. అధికారులు ఆ ప్లాట్లకు ఎక్కువ ధర పలికింది కాబట్టి మిగిలిన వాటిని కూడా అదే ధరకు అమ్మాలని చూసేవారు. అంతకంటే తక్కువకు పాడిన వారికి ఇచ్చేవారు కాదు. నిబంధనలు అంగీకరించవని చెప్పేవారు. దాంతో ఎవరూ కొనడానికి ముందుకు వచ్చేవారు కాదు. దీనివల్ల వీఎంఆర్‌డీఏ లేఅవుట్లలో వందల కొద్దీ ప్లాట్లు మిగిలిపోయే పరిస్థితి వచ్చింది.

నష్టం తప్పించుకోవాలని...

రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేలం పాటల్లో పాల్గొంటున్నారని అంతా ఆరోపించడంతో ఎవరు వేలం పాట పాడుతున్నారో తెలియకుండా ఉండేందుకు కొత్తగా 'ఈ-వేలం' అమలులోకి తీసుకువచ్చారు. ఈ విధానంలో పాటదారులు వారి ఇల్లు, ఆఫీసులో కూర్చొనే పాటలో పాల్గొనవచ్చు. పాటదారులు ఎవరో అధికారులకు తప్ప ఇతరుకు తెలియదు. దీనివల్ల పోటీ ... మిగతా 6వ పేజీలో

ఏయూ అధికారుల నిర్లక్ష్యం

- నాలుగో సెమిస్టర్ పరీక్ష పత్రంలో మూడో సెమిస్టర్‌కు సంబంధించిన ప్రశ్నలు
- ఇన్విజిలేటర్ల దృష్టికి తీసుకువెళ్లిన విద్యార్థులు..



విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్ విభాగం అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. పరీక్షల నిర్వహణలో ప్రతిసారి ఏదో ఒక తప్పు చేయడం ఈ విభాగానికి పరిపాటిగా మారింది. తాజాగా జరుగుతున్న పీజీ పరీక్షల్లోనూ మరోసారి ఏయూ అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ఈ నెల 19 నుంచి పీజీ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థులకు నాలుగో సెమిస్టర్‌కు సంబంధించి 'ఆర్గానిక్ స్పెక్ట్రోస్కోపీ అండ్ స్ట్రక్చర్ డిటర్మినేషన్ ఆఫ్ నేచురల్ ప్రొడక్ట్స్' పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు సంబంధించి సిలబస్‌గా ఐదు యూనిట్లు ... మిగతా 6వ పేజీలో

బార్లలో ఇష్టారాజ్యం

నిబంధనలు పట్టించుకోని నిర్వాహకులు

- పోలీసుల తనిఖీల్లో బయటపడిన లొసుగులు
- ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయం
- కానరాని ఫైర్ సేఫ్టీ, సీసీ కెమెరాలు
- ఉన్నతాధికారుల నివేదిక
- అయినా కానరాని దిద్దుబాటు చర్యలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో బార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనేక బార్లలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయని, భద్రతా చర్యలు పాటించడం లేదని ఇటీవల పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో బహిర్గతమైంది. దీనిపై సంబంధిత శాఖల అధికారులకు నివేదిక పంపించినా ఇంతవరకూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నగర పరిధిలో 127 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయి. బార్ అండ్ రెస్టారెంట్‌ల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతితోపాటు జీవీఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే అగ్ని ప్రమాదాలు వంటివి సంభవించినా సకాలంలో మంటలను ఆర్పేందుకు వీలుగా అన్నిరకాల పరికరాలను ఏర్పాటుచేసి ఆ శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలి. అయితే నగరంలోని చాలా బార్‌లలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిగిపోతున్నాయి. పలుబార్లలో ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. అలాగే బార్‌ల లోపల, బయట తరచూ కొట్లాటలు జరుగుతుంటాయి. రెండు, మూడు హత్యలు కూడా జరిగాయి. దర్యాప్తులో భాగంగా అక్కడకు వెళ్లిన పోలీసులకు కనీసం సీసీ కెమెరాలు కూడా లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఇటీవల 450 మంది పోలీసులు 92 బృందాలుగా ఏర్పడి 104 బార్ అండ్ రెస్టారెంట్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 23 బార్‌లలో ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని, 14 బార్ అండ్ రెస్టారెంట్‌లకు ఫైర్ ఎన్‌ఓసీ లేదని, రెండు బార్‌లలో సీసీ కెమెరాలు లేవని, ఒక బార్ అండ్ రెస్టారెంట్‌కు ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేదని, రెండు బార్‌లకు ట్రేడ్ లైసెన్స్ లేదని, ఒక బార్ అండ్ రెస్టారెంట్‌కు జీఎస్‌టీ లేదని గుర్తించారు. ఉల్లంఘనలపై పోలీస్ ఉన్నతాధికారులు నివేదిక తయారుచేసి చర్యల నిమిత్తం సంబంధిత శాఖలకు పంపించారు. అయితే ఆయా శాఖలు చర్యలు తీసుకున్నట్టు ఇంతవరకూ ఎలాంటి దాఖలాలు లేవు. స్వయంగా పోలీసులే తనిఖీలు నిర్వహించి లోపాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరినా స్పందన లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ముంబై పర్యటనకు వీఎంఆర్‌డీఏ కమిషనర్

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం ముంబై బయలుదేరి వెళ్లారు. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ అమలుచేస్తున్న విధానాలు, చేపట్టిన ప్రాజెక్టులను ఆయన అధ్యయనం చేయనున్నారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు బాధ్యతలు అప్పగించారు.

25వ తేదీన డీఆర్‌సీ

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా అభివృద్ధి సమీక్ష (డీఆర్‌సీ) సమావేశం ఈనెల 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరగనున్నది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సహా విద్య, వైద్యం, పర్యాటకం తదితర 11 శాఖలపై సమీక్ష నిర్వహిస్తారు.



వాదన ఆడుకుంటున్న ఇరువర్గాలు

విశాలాక్షినగర్‌లో స్థల వివాదం

- రెండు వర్గాల వాదులాట
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ



జేసీబీతో స్థలం చదును పనులు

విశాలాక్షినగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని వెటర్నరీ కాలనీలో స్థల వివాదం చోటుచేసుకుంది. కొంత మంది వ్యక్తులు సోమవారం జేసీబీతో వచ్చి ఖాళీగా ఉన్న స్థలాన్ని చదును చేయడంతో వివాదానికి దారి తీసింది.ఖాళీ స్థలం పశుపోషణ (ఏనిమల్ హస్ బెండరీ)కి చెందినదని ఆ విభాగానికి చెందిన వైద్యులు వచ్చి పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వావాదం జరిగింది. పశు పోషణకు చెందిన వైద్యులు అశోక్, భాస్కరరావు, సతీశ్, సిబ్బంది వచ్చి సర్వే నెంబర్ 133/8 స్థలం వెటర్నరీ సంస్థకి చెందినదని చెప్పారు. ఈ ప్రాంతంలో 34 ఎకరాలు అప్పట్లో సంస్థ అవసరాల కోసం రైతుల నుంచి సేకరించామని, కొంత అసోసియేషన్‌కి కేటాయించామని తెలిపారు.సబ్ డివిజన్‌లు చేయగా ప్రస్తుత స్థలం 133/8లో 3.11 ఎకరాలు ఉందని, దీనిపై గతంలో వివాదం జరగ్గా ఆర్డీవో, జేసీ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని వివరించారు. అప్పట్లో సంస్థ వినియోగం కోసం ఈ స్థలాల్లో గడ్డి పెంచేవాళ్లమని, ప్రస్తుతం ఖాళీగా ఉందని పేర్కొన్నారు. స్థలాన్ని చదును చేయడానికి వచ్చిన వారు తమ తాతలకు చెందిన భూమి అంటూ చెప్పడంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు వివాదం చోటుచేసుకుంది. ఈ విషయం ఆరిలోవ పోలీసులకు తెలియడంతో ఎస్ఐ కృష్ణ ఇరువర్గాలను పిలిపించి, స్థలానికి సంబంధించిన పత్రాలు ఉంటే స్టేషన్‌కు తీసుకురావాలని చెప్పారు. అప్పటివరకు పనులు నిలిపివేయాలని హెచ్చరించారు.

ఐటీ హబ్ స్థల సేకరణపై గ్రామసభ



ఆర్‌డీఓ మాధూర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఆనందపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లువాడ గ్రామంలో ఐటీ హబ్ ఏర్పాటుకు స్థల సేకరణపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. తర్లువాడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 1లో సుమారు రెండు వందల ఎకరాలు ఐటీ హబ్‌కు కేటాయించడానికి స్థల సేకరణ జరగడంతో పాటు సర్వే నిర్వహించారు. ఈమేరకు ఆర్డీవో సంగీత్ మాధూర్, తహసీల్దార్ శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు మాట్లాడుతూ ఐటీ హబ్‌కు కేటాయిస్తామన్న స్థలంలో సుమారు వంద ఎకరాల వరకు డీపట్టా భూములు ఉండగా మిగిలిన వంద ఎకరాల్లో డీఆర్‌డీఏ బంజరు భూమి అభివృద్ధి పథకంలో భాగంగా రైతులు జీడి, మామిడి మొక్కలు వేసి, జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఐటీ హబ్‌కు భూములు కేటాయించడంతో వారి జీవనోపాధి దెబ్బతింటుందని, వారికి కూడా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో 520 మంది వరకు రైతులు ఉన్నారని, వారందరికీ సమానంగా నష్టపరిహారం అందించాలన్నారు. అలాగే డీపట్టా రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన రూ. 42 లక్షలకు బదులుగా రూ. 70 లక్షలు నష్టపరిహారం అందించేలా చూడాలని గ్రామస్తులు తరపున కోరారు. ఈమేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో సంగీత్ మాధూర్ మాటాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారాదా ప్రియాంక, నాయకులు తాత్రాజు అప్పారావు, బంకు రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘చందనోత్సవంలో బాలలకు కనీస సౌకర్యాలు కల్పించాలి’

సింహాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామి నిజరూప దర్శనం చందనోత్సవానికి వచ్చే చిన్నారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, దేవస్థానం అధికారులను కోరారు. ఈమేరకు సోమవారం కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ఒక ప్రకటన విడుదల చేశారు. క్యూలో పిల్లలకు పాలిచ్చు తల్లులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు.. అలాగే క్యూలో నిలిచి ఉండే పిల్లలకు తాగునీరు, వేడిపాలు, బిస్కెట్లు పంపిణీ చేయాలని సూచించారు. గర్భిణిలు, బాలింతలు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే ఉత్సవంలో తప్పిపోయిన బాలలను తమ వారి వద్దకు తిరిగి చేర్చేందుకు అన్ని శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణా మార్గం తొలగింపు

పద్మనాభం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురం గోస్తనీ నదిలో ఇసుక అక్రమ రవాణాకు వేసిన రహదారిని రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి తొలగించారు. గ్రామంలోని గోస్తనీ నదిలో అనధికారికంగా గ్రావెల్ రోడ్డు వేసి రాత్రి వేళ లారీలు,ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నట్టు అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. తహసీల్దారు ఆనందరావు ఆదేశాల మేరకు ఆర్ఐ శ్యామల, వీఆర్వో రవి జేసీబీతో రోడ్డును తవ్వి, తొలగించారు. ఇసుక అక్రమ తవ్వకాలను జరగనివ్వబోమని చెప్పారు.



ఎమ్మెల్యే గంటాకు సమస్యను వివరిస్తున్న ముస్లిం కాలనీవాసులు

ఇళ్ల పట్టాల కోసం ముస్లింల వినతి

కొమ్మాది, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పీఎం పాలెంలోని ఆర్‌హెచ్ కాలనీకి ఆనుకుని ఉన్న ఉస్మానియా ముస్లిం కాలనీలో ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. సోమవారం వారు ఆయన్ను నగరంలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా 6వవార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ కాలనీవాసులు ఇళ్లకు పట్టాలు కావా లని దరఖాస్తు పెట్టుకోగా, అది మాస్టర్ ప్లాన్ రహదారిలో ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ అధికారులను కలిస్తే అక్కడున్న ఇళ్ల వల్ల రోడ్డుకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారని వివరించారు. ఈ విషయమై కాలనీవాసులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులతో పాటు మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

శివుడు కుడి కన్ను తెరిచినట్టు ప్రచారం

- భారీగా తరలివచ్చిన భక్తులు



ఆటోనగర్ (విశాఖపట్నం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని గాజువాక ఆటోనగర్‌లో గల స్వయంభూ శ్రీదుర్గా నాగలింగేశ్వర ఆలయంలో సోమవారం ఉదయం అర్చకులు కన్నబాబు పూజలు నిర్వహిస్తుండగా...శివుని విగ్రహం ఎడమ కన్ను మూసి, కుడి కన్ను తెరిచి కనిపించడంతో సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. ఈ విషయం ఆ నోటా, ఈ నోటా ప్రచారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కన్నబాబు మాట్లాడుతూ పంచామృతాలు, విభూదితో అభిషేకం నిర్వహిస్తుండగా ఈ అద్భుతం జరిగిందన్నారు. ఇక్కడ సుబ్రహ్మణ్యస్వామి, నాగ బంధం, పురాతన పుట్ట, శ్రీదుర్గమ్మ మూడు దశాబ్దాల కిందట వెలసినట్టు అర్చకులు చెబుతున్నారు.

‘వైద్యం, విద్య వ్యాపారంగా మారరాదు’

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేశ్



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.వి. రమేశ్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వైద్యం, విద్య వ్యాపారంగా మారడమే వైద్య వ్యవస్థ అభివృద్ధికి ఆటంకమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేశ్ అన్నారు. సోమవారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ హరిప్రసాద్ మెమోరియల్ లెక్చర్, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఆరోగ్య రంగం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ - ప్రభావాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం అన్నది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతన్నారు. గత వందేళ్లలో ఫార్మా, వైద్య రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయని,అమెరికాలో 50 శాతం మందికి ఉచిత వైద్యం లభిస్తుందని చెప్పారు. మిగిలిన వారు ఇన్సూరెన్స్ ద్వారా వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఏపీలో ప్రభుత్వ వైద్యంపై మధ్య తరగతి ప్రజలకు నమ్మకం పోయిందని, ప్రస్తుత పరిస్థితికి ఇది కూడా కారణమన్నారు. కార్యక్రమంలో జీవీపీఐ హెచ్‌సీ అండ్ ఎంటీ మాజీ డీఎంఈ డైరెక్టర్ ఆపరేషన్స్ డాక్టర్ సత్య వరప్రసాద్, అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం కన్వీనర్ కామేశ్వరరావు, జీఎస్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

కాలువలు మూసివేతపై ఫిర్యాదు

మధురవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో ఒక వ్యక్తి కాలువలు మూసివేసి ప్రహరీ నిర్మించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేశ్ తెలిపారు. ఈవిషయమై సోమవారం ఆయన వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే నంబరు 125/2, 126/2లో లేఅవుట్ నంబర్ 87/97 ప్రకారం రహదారులు, కాలువలు నిర్మించి 1998లో 325 కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక వ్యక్తి సర్వే నంబరు 126/4 నంబరులో ఉన్న భూమి తనదని కాలువలు, రహదారులు తొలగించి ప్రహరీ నిర్మించడంతో మురుగు నీరు నిల్వ ఉండడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు జేడీ నాయుడు, సీహెచ్‌వై నాయుడు, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్టు లైట్లు ఏర్పాటు

సింహాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం నేపథ్యంలో దేవస్థానం అధికారులు సింహగిరిపై నూతనంగా హైమాస్టు లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం కాటేజీకి వెళ్లే మార్గంలో మూడు ప్రాంతాల్లోను, మాడవీధుల్లో రెండు ప్రాంతాల్లోను లైట్లు అమర్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్



పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సింహాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ఉపాధ్యాయులు సోమవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈమేరకు 98వ వార్డు పరిధిలోని ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి అక్కడి 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం ఇమంది పైడిరాజు, సుభాశ్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా పనులు

పద్మనాభం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురం పంచాయతీలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కాకుండా పట్టా నెంబరు మార్పు చేసి వేరొక స్థలంలో ఎటువంటి అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టినట్టు అదే గ్రామానికి చెందిన బీజేపీ మండల కార్యదర్శి కంటుబోటు సత్యవతి తెలిపారు. సోమవారం ఆమె ఈ విషయమై తహసీల్దార్ ఆనందరావుకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సుధాల దుర్గా భవానీకి సర్వే నెంబరు 60/1లో గతంలో స్థలం కేటాయించారు. అక్కడ కాకుండా వేరేచోట పట్టా మార్పు చేసి, ఇంటి నిర్మాణం చేపట్టారన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



గర్భిణీల సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పద్మనాభం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సక్రమమైన జీవన శైలిని అలవాటు చేయడం ద్వారా పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. మణికుమారి అన్నారు. పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో భీమిలి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భిణిగా ఉన్నప్పటి నుంచి పిల్లలకు రెండేళ్లు వచ్చే వరకు సరైన పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల తల్లీ బిడ్డ ఆరోగ్యం బాగుంటుందన్నారు. అనంతరం గర్భిణిలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు సామూహిక అన్నప్రాసనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమణ, ఏఓ జయ ఉమ, ఏపీఎం రమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేఖవానిపాలెంలో ఉపాధి కూలీల నిరసన



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గంగారావు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రేఖవానిపాలెంలో ఉపాధి కూలీలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పనులు చేస్తున్న ప్రాంతంలో పనులు నిలుపుదల చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా 78వ వార్డు కార్పొరేటర్, సీపీఎం నాయకుడు బి. గంగారావు మాట్లాడుతూ ఉపాధి పనుల కోసం కేటాయించిన రూ 12.25 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేంద్రం రూ. 65 వేల కోట్లకు తగ్గించిందన్నారు. కూలీలు పని చేసిన 15 రోజుల్లో బిల్లులు చేయాలన్న నిబంధన ఉన్నా, అధికారులు అమలు చేయడం లేదని చెప్పారు. ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని, కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హత ఉన్న వారందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జోనల్ కార్యదర్శి కె. నాగరాణి, ఎస్. గున్న పాల్గొన్నారు.



జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

రోడ్డుకు మరమ్మతులు చేయాలని ధర్నా

కొమ్మాది, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డు పరిధిలోని కె1, కె2 కాలనీలకు వెళ్లే రోడ్డుకు మర మ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆయా కాలనీల ప్రజలు సోమవారం జోన్-2 కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు డి. అప్పలరాజు మాట్లాడుతూ ఆయా కాలనీలకు వెళ్లే రోడ్డు జవహర్ నవోదయ విద్యాలయం వద్ద పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. కాలనీల్లో నివసిస్తున్న వారంతా పేదలు కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు అనంతరం ఆయన జడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు. కాలనీల్లో పర్యటించి, సమస్యను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి. రాజ్‌కుమార్, కె1, కె2 కాలనీ నాయకులు అవతార్‌సింగ్, ఎండీ అతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు 25 శాతం సీట్లు ఇవ్వాలి : ఆర్‌జేడీ



మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

సాగర్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు 25 శాతం సీట్లను నిరుపేద పిల్లలకు కేటాయించాలని ఆర్‌జేడీ బి. విజయభాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన రుషికొండ వాడపాలెం ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చినగదిలిలోని అన్ని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు ఒకటో తరగతిలో 12 (1) సి ప్రకారం 25 శాతం ఉచిత విద్య అందించాలన్నారు.ఈమేరకు సీఎస్ఈ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 25వ తేదీలోగా ఈప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. అలా చేయని వారిపై క్రమశిక్షణ చర్యలు వుంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 26 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈఓలు సీహెచ్ రవీంద్రబాబు, అనురాధ, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా బస్ షెల్టర్ల నిర్మాణాలు



విజయానందపురం జంక్షన్‌లో అసంపూర్తిగా ఉన్న బస్ షెల్టర్ నిర్మాణం

పద్మనాభం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎండీఎస్ నిధులతో 2020, అక్టోబరు 10న విజయానందపురం జంక్షన్‌లోను, పద్మనాభం జంక్షన్‌లోను బస్ షెల్టర్ల నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. ఒక్కొక్క బస్ షెల్టర్ నిర్మాణానికి రూ. 10 లక్షల చొప్పున కేటాయించారు. ఐదేళ్లయినా ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. స్లాబులు వేసి, మిగతా పనులను విడిచిపెట్టారు. బస్ షెల్టర్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఎండలో నిరీక్షించాల్సి వస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి నిర్మాణాలను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

న్యూరో విభాగానికి పరికరాలు వితరణ

మహారాణిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని న్యూరో సర్జరీ విభాగానికి వైద్యుడు సుంకర బాలపరమేశ్వరరావు రూ. 8 లక్షల విలువ చేసే శస్త్ర చికిత్స పరికరాలను వితరణగా అందించారు. సోమవారం ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు వీటిని అందజేశారు.

తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

... 5వ పేజీ తరువాయి

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మూడు రాజధానులు ఉండవని స్పష్టత వచ్చింది. అయినా ఆదాయంలో పెద్దగా తేడా రాలేదు. వేయి కోట్ల రూపాయల మార్కును కొనసాగిస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,047.74 కోట్ల ఆదాయం చూపించారు. గత ఏడాది కంటే కేవలం రూ.13 కోట్లు మాత్రమే రాబడి తగ్గింది. జిల్లాల విభజనలో భాగంగా రెండేళ్ల క్రితం అనకాపల్లి జిల్లాలో ఉన్న పెదగంట్యాడను తీసుకువచ్చి విశాఖ జిల్లాలో కలిపారు. దాంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సంఖ్య తొమ్మిది నుంచి పదికి పెరిగింది.

అన్ని కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

ఈ నెల మొదటి వారంలో రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభించారు. జిల్లాకు ఒక కార్యాలయం చొప్పున మొదలుపెట్టగా తొలుత విశాఖలో సూపర్ బజారు ప్రాంగణంలోని ఆర్ఓలో శ్రీకారం చుట్టడం జరిగింది. కొద్దిగా ఇబ్బందులు ఉన్నా..అప్పుడప్పుడు సర్వర్ మొరాయిస్తున్నా ప్రభుత్వం స్లాట్ల ద్వారానే రిజిస్ట్రేషన్లు చేయాలని స్పష్టం చేసింది. దాంతో ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో స్లాట్ల ద్వారానే రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్టు డీఐజీ బాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



కూడలిలో దుస్థితి

ఇరుకు రోడ్డుతో అవస్థలు

- తగరపువలస కూడలిలో దుస్థితి
- ఆక్రమణలే కారణం

తగరపువలస, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస కూడలిలో ప్రధాన రహదారి ఆక్రమణలకు గురవ్వడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఈకూడలి మీదుగా వెళ్లేవి. ప్రస్తుతం విశాఖ, తగరపువలస మధ్య తిరిగే 222 నంబరు సర్వీసులు, తగరపువలస, పెందుర్తి, అనకాపల్లి మధ్య తిరిగే 55టి, 888 బస్సులు, విశాఖ-విజయనగరం మధ్య తిరిగే సిటీ బస్సులు మాత్రమే ఈ కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే కూడలిలో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు నిర్వహిస్తుండడం, రోడ్డు ఆక్రమణల వల్ల బస్సుల రాకపోకలకు అవస్థలు ఏర్పడడంతో పాటు ప్రయాణికులు నడవడానికి కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డు ఇరుకు వల్ల ట్రాఫిక్ పెరిగిపోయి బస్సులు మలుపు తిప్పడానికి కూడా అవకాశం లేదు. 20 ఏళ్ల క్రితం ఈ కూడలిని విస్తరించారు. మళ్లీ ఇప్పుడు విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. లేకపోతే ఆక్రమణలు తొలగిస్తే కొంతవరకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

... 5వ పేజీ తరువాయి

పెంచి కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉందని అరకులోయ ప్రాంతానికి చెందిన ఎం.బుజ్జిబాబు ఆనందాన్ని వ్యక్తంచేశారు. బీఈడీ పూర్తయి పదేళ్లు అవుతోందని, ఇప్పటివరకూ ఒకే ఒక్క డీఎస్సీ రాశానని, మరోసారి రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని రాజ్యలక్ష్మి అనే అభ్యర్థిని పేర్కొన్నారు. పరీక్షకు సమయం తక్కువగా ఉన్నా అభ్యర్థులకు ఇచ్చిన మాట ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉందని బి. సుధారాణి అనే అభ్యర్థిని తెలిపారు.

వేలాది మంది నిరుద్యోగులు

ఉపాధ్యాయ పోస్టుల కోసం పోటీ పడే వారి సంఖ్య రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ఉత్తరాంధ్రలో అధికంగా ఉంది. చివరిసారిగా 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ విడుదలైంది. అప్పటి నుంచి నోటిఫికేషన్ లేకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. ఉమ్మడి జిల్లాలో పోటీ పడుతున్నవారు సుమారు 35 వేల నుంచి 40 వేల మంది వరకూ ఉండవచ్చునంటున్నారు.

వీఎంఆర్‌డీఏ ఈ-వేలంపై పెదవివిరుపు

... 5వ పేజీ తరువాయి

ఉండదని, అవసరమైన వారు పాడుకుంటారని అనుకున్నారు. కానీ ఇది కూడా సవ్యంగా సాగడం లేదు. వీఎంఆర్‌డీఏలో ఈ వ్యవహారాలు చూసే సిబ్బందిని కొందరు మచ్చిక చేసుకున్నారు.

పాటదారుల సమాచారం వారు బయటకు చేరవేయడం ప్రారంభించారు. ఏదైనా డిమాండ్ ఉండి పాటకు పోటీ పెరుగుతుంటే...అవతల వైపు పాడుతున్న వారి వివరాలు (ఫోన్ నంబరు, పేరు) రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అందిస్తున్నారు. దాంతో ఆయా నంబర్లకు ఫోన్ చేసి, తాము ఎంతైనా పాడుకుంటామని, పోటీ పడితే నష్టమని, వెనక్కి తగ్గిపోతే 'బహుమానం' ఇస్తామని చెప్పి వారిని పోటీ నుంచి తప్పించడం మొదలుపెట్టారు. దీనివల్ల వీఎంఆర్‌డీఏకు అప్‌సెట్ ధర మీద ఎక్కువ రేటు రావడం ఆగిపోయింది. ఇలాంటి బెదిరింపుల వల్ల చాలామంది వీఎంఆర్‌డీఏ ప్లాట్లకు దరఖాస్తు చేయడం తగ్గించేశారు. మరోవైపు విశాఖ పరిసరాల్లో భూముల రేట్లు కూడా పెరిగిపోవడంతో అంతంత రేటు పెట్టి, వేలంలో పాడాల్సిన అవసరం ఏమిటని చాలామంది ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ-వేలం పాటకు ఆదరణ తగ్గిపోయింది.

ప్రత్యక్ష వేలంపై ఆలోచన చేస్తున్నాం

- ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

వీఎంఆర్‌డీఏ ఈ-వేలం పాటలపై చైర్మన్ ప్రణవ్ గోపాల్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా, అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో కొందరు వేలం పాటదారుల సమాచారం లీక్ చేస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. ఒకరిపై చర్యలు తీసుకుంటే మరొకరు లీక్ చేస్తారని, అందుకే వేలం పాటలు పూర్వంలాగే ప్రత్యక్ష విధానంలో నిర్వహించాలని ఆలోచిస్తున్నామని, దీనిపై అధికారులతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఏయూ అధికారుల నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. అయితే, అందులో రెండు యూనిట్లకు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే నాలుగో సెమిస్టర్ సిలబస్ నుంచి ఇచ్చారు. మిగిలిన మూడు యూనిట్లు కూడా మూడో సెమిస్టర్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇవ్వడంతో విద్యార్థులు షాక్ తిన్నారు. ఈ విషయం విద్యార్థులు గుర్తించి ఇన్విజిలేటర్లకు తెలియజేశారు. పలు కాలేజీల్లోని ఇన్విజిలేటర్లు...ఏయూ అధికారులకు తెలియజేశారు. అయితే, పరీక్షను యథావిధిగా కొనసాగించాలని చెప్పారు. పరీక్షల విభాగం నిర్లక్ష్యం వల్ల సుమారు వేయి మందికిపైగా విద్యార్థులు ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఉన్నతాధికారులు ఈ సెక్షన్‌పై దృష్టిసారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటే తప్ప తప్పులకు బ్రేక్ పడేలా లేదంటున్నారు.

హెల్త్ సిటీలో వీధి లైట్ల ఏర్పాటు



హెల్త్ సిటీలో వెలుగుతున్న వీధి లైట్లు

ఆరిలోవ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ హెల్త్ సీటిలో వీధి దీపాలు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతం లో వీధి లైట్లు వెలగకపోవడంతో ఈ ప్రాంతమంతా గాఢాంధకారంలో ఉందం టూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. జీవీఎంసీ అధికారులు వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవడంతో ఈ ప్రాంతం ధగధగ విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. కొన్ని రోజుల కిందట చీకటి పడితే ఈ ప్రాంతంలో తిరగడానికి భయపడేవారమని, ఇప్పుడు నిర్భయంగా తిరిగే అవకాశం ఏర్పడిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా.. హెల్త్ సిటీకి వచ్చే రోగులు, బంధువులు ఇబ్బందులు తొలగాయంటూ ఆనందంగా చెబుతున్నారు.

యువతి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కేఆర్ఎం కాలనీకి చెందిన యువతి కనిపించడం లేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం.. మునపాటి ఈశ్వరరావు తన కుటుంబంతో కేఆర్ఎం కాలనీలో ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆమె కుమార్తె సమీపంలోని బంధువు ఇంటికి వెళ్లింది. వారింటి మేడపైకి వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. అయితే అక్కడ లేకపోవడాన్ని గమనించి పరిసర ప్రాంతాలు,, బంధువులు, స్నేహితులకు వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మురళీ పర్యవేక్షణలో అదృశ్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డీడీ హైగ్రేడ్ కూచిపూడి నృత్యకళాకారిణిగా లిపికారెడ్డి ఎంపిక



రామ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరానికి చెందిన కేపీ లిపికా రెడ్డి కూచిపూడి నృత్య విభాగంలో బి హైగ్రేడ్ కళాకారిణిగా ఎంపిక అయింది. హైదరా బాద్ దూరదర్శన్ కేంద్రం ఇటీవల కూచి పూడి నృత్య కళాకారులకు సెలక్షన్స్ నిర్వ హించారు. ఈ ఆడిషన్స్‌లో లిపికా రెడ్డి ఎంపిక కావటంపై విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ అభినందించారు. లిపికా రెడ్డి ఇప్పటి వరకూ దేశ విదేశాల్లో సుమారు రెండు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో సుమారు 150కి పైగా పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. దేశంలో మూడు వందలకు పైగా ప్రముఖ దేవాలయాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు, 38 వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సంగీత నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 17, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 34 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 54, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

కనుమరుగవుతున్న పచ్చదనం

- సంరక్షణ కోసం నిధులు వెచ్చిస్తున్నా ఫలితం శూన్యం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం



హనుమంతవాక జంక్షన్ నుంచి శ్రీకృష్ణాపురం వరకు గల డివైడర్ల మధ్యలో ఎండిన మొక్కలు

ఆరిలోవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : 'మొక్కలను కాపాడండి.. పచ్చదనం పెంచండి' అనే స్లోగన్ చెప్పడం కాదు ఆచరణలో చూపడానికి ప్రత్యేక కార్యాచరణ అవసరం. చెట్ల సంరక్షణకు ఓపిక ఉండాలి. కాస్త ఖర్చు కూడా అవుతుంది.

బీఆర్టీఎస్ రోడ్డులో పచ్చదనం పెంచి ఆహ్లాదకర వాతావరణం పెంపొందించే ఉద్దేశంతో డివైడర్ల మధ్యలో మొక్కలు నాటారు. ఇందులో భాగంగా హనుమంతవాక జంక్షన్ నుంచి శ్రీకృష్ణాపురం వరకు గల డివైడర్ల మధ్యలో మొక్కలు నాటారు. ఈ మొక్కలకు నీరును పోయడానికి కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. కానీ సదరు కాంట్రాక్టర్ డబ్బులు జేబులో వేసుకొని మొక్కలకు నీరును పోయడం మానేశాడు. దీంతో మొక్కలు ఎండకు ఎండి పోతున్నాయి. దీంతో వేసవిలో ఆహ్లాదం మాట అటుంచితే, మొక్కల పేరుతో ప్రజాధనం వృథా అవుతోందని పలువురు అంటు న్నారు. అధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం ఎంపీకి వినతి



ఎంపీ శ్రీభరత్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి వద్ద ట్రాఫిక్ అధికమవడంతో పాదచారులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ ప్రాంతంలో ఒక ఫుట్ ఓవర్ బ్రిడి నిర్మించాలని కోరుతూ నగర ఎంపీ భరత్‌కు 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య వినతి పత్రం అందజేశారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి జాతీయ రహదారిపై పుట్‌ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలిండియా అంతర్ వర్సిటీ కిక్ బాక్సింగ్‌లో నితిన్‌కు పతకం

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహించిన బి.నితిన్ పతకం సాధించాడు. ఉత్తరప్రదేశ్, మీరట్‌లో జరిగిన ఈ టోర్నీలో నితిన్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి కాంస్య పతకం దక్కించుకున్నారు.

ఈ సందర్భంగా ఏయూ వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రం విభాగాధిపతి ఎ.పల్లవి తన కార్యాలయంలో పతకం సాధించిన నితిన్‌తో పాటు కోచ్ ఆనందబాలును అభినందించారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో పతకం సాధించి ఏయూ ఖ్యాతిని పెంచారని అభినందించారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకోసం ప్రాథమిక పాఠశాలల సందర్శన



శ్రీకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో హెచ్ఎం పైడిరాజు, టీచర్లు

ఆరిలోవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి మండలం పరిధిలో గల ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులను ఆరో తగతితిలో చేరాలని కోరుతూ అడవి వరంలో గల జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు సోమవారం పలు పాఠశాలలను సందిర్శించారు. ఇందులో భాగంగా శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఆరో తగతిలో చేరాలంటూ వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఈ విధంగా అన్ని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి అక్కడ ఐదో తరగతి విద్యార్థులను చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నట్టు హెచ్ఎం పైడిరాజు తెలిపారు. ఈ నెల 23 వరకు ఈ విధంగా అడ్మిషన్ తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకూ 84 మంది విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశం పొందారని ఆయన తెలిపారు.

మల్టీ లెవర్ పార్కింగ్‌ను సందర్శించిన వీఎంఆర్డీఏ చైర్మన్



అధికారులకు సూచనలిస్తున్న చైర్మన్ ప్రణవ్ గోపాల్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏకు చెందిన డీడెడ్ మల్టీ లెవల్ కారు పార్కింగ్ ప్రాంగణం, యూహెచ్3హెచ్‌లను వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సోమవారం సందర్శించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా వీటిని ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ రెండు ప్రాజెక్టులు సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఇంజనీర్లు భవానీశంకర్, బలరామరాజు, మధుసూదన్, రామరాజు, దుర్గాప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి అరుదైన సర్జరీ

- పొత్తి కడుపులో ఏర్పడిన క్యాన్సర్‌కు శస్త్రచికిత్స

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఓయువకుడి పొత్తి కడుపులో ఏర్పడిన అరుదైన క్యాన్సర్‌కు హైపర్‌థెర్మిక్ పద్ధతిలో సర్జరీ చేసి ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఈ సర్జరీకి సంబంధించిన వివరాలను సోమవారం సూరారంలోని మల్లారెడ్డి నారాయణ క్యాన్సర్ ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన ఆస్పత్రి వైద్యులు సీనియర్ సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ హరీష్, సీనియర్ అనస్థటిస్టు డాక్టర్ జి. నరేంద్ర ప్రకాష్ వివరించారు. విశాఖపట్నంకు చెందిన గౌతమ్ కుమార్(24) తీవ్రమైన కడుపు సమస్యతో ఇటీవల ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రిలో చేరినప్పుడు అతను ప్రైమరీ పెరిటోనియల్ ఎవింగ్స్ సార్కోమాతో సమస్యతో బాధపడుతున్నాడు, ఇది అసాధారణంగా అరుదైన, ప్రాణాంతకమైన వ్యాధిగా వైద్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో మల్టీడిసిప్లినరీ అంకాలజీ బృందం రోగికి 16 గంటల పాటు శస్త్ర చికిత్సను నిర్వహించారు. హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కీమోథెరపీ పద్ధతిలో సర్జరీ చేశారు. ఈ విధానం అవశేష మైక్రోస్కోపిక్ క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో సహాయపడుతుందని, ఆరోగ్యకరమైన కణజాలాలకు నష్టాన్ని తగ్గించడంలో ఔషధ సామర్థ్యాన్ని పెంచుతుందని చెప్పారు. అండాశయం, కొలొరెక్టల్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్‌లు, సూడోమైక్సోమా పెరిటోని, మెసోథెలియోమా, కొన్ని అరుదైన సార్కోమాస్ వంటి ఉదర క్యాన్సర్‌లకు చికిత్స చేయడంలో ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. అరుదైన, అత్యంత కీలకమైన కేసులకు నమ్మకంగా, జాగ్రత్తగా చికిత్స అందిస్తున్నట్లు మల్లా రెడ్డి గ్రూప్ చైర్మన్ భద్రారెడ్డి వ్యాఖ్యానించారు. పెరిటోనియల్ ఎవింగ్ సార్కోమాను ఆధునిక పద్ధతిలో చికిత్స చేయడం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో చాలా అరుదు అని మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రీతీ రెడ్డి తెలిపారు.

టీచర్లు వైద్య పరీక్షలకు హాజరు కావాల్సిందే..

- మెడికల్ సర్టిఫికెట్ ఆధారంగానే ప్రిఫరెన్సియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు
- డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ విద్యాశాఖ ఆదేశాల మేరకు పూర్వపు విశాఖ జిల్లా పరిధిలో గల ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, మున్సిపాలిటీ.మున్సిపాల్ కార్పొరేషన్ పరిధిలో విదులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ రెగ్యులేషన్ యాక్టు-2025 ప్రకారం ప్రిఫరెన్సియల్ కేటగిరి/స్పెషల్ పాయింట్స్ పొందవలసినవారు తప్పనిసరిగా మెడికల్ క్యాంప్‌నకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కేజీహెచ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయుల తమ పాత ఆరోగ్య పరిస్థితి సర్టిఫికెట్లు సంబంధిత వైద్యులకు చూపించి, తాజాగా వైద్యులతో వైద్య పరీక్షలు చేయించుకొని కొత్త సర్టిఫికెట్లను తీసుకోవాలని కోరారు. ఈ క్యాంపులో పొందిన ఆరోగ్య సర్టిఫికెట్ ఆదారంగా మాత్రమే ప్రిఫరెన్సియల్ కేటగిరి, స్పెషల్ పాయింట్ వర్తింప జేయడం జరుగుతుందన్నారు. విశాక జిల్లా వారికి ఈ నెల 24న, 25న అనకాపల్లి జిల్లా వారికి, 26న అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యాయులకు మెడికల్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్టు డీఈవో తెలిపారు.

మైసూర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో రాణిస్తున్న రమణయ్య



విశాఖపట్నం, స్పోర్ట్సు ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సూపర్ సీనియర్స్ మైసూర్ ఓపెన్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన పి.వెంకటరమణయ్య అద్భుతంగా రాణిస్తున్నారు. మైసూర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో 65 ప్లస్ ఏళ్ల విభాగం డబల్స్‌లో పోరాట పటిమను ప్రదర్శించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు. తన పార్టనర్ రింజిత్ లంకతో కలిసి డబల్స్ ఆడుతున్న రమణయ్య...ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో వేణుగోపాల్-హసనత్ జంటపై 2-0 స్కోరుతో, రెండో రౌండ్‌లో తమ ప్రత్యర్థులపై 2-1 స్కోరుతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు. త్వరలో జర్మనీలో జరగనున్న వరల్డ్ ట్రాన్స్ ప్లాంట్ గేమ్స్‌కు సిద్ధమవుతున్న రమణయ్య...65 ఏళ్ల దాటిన వయసులో కూడా దేశంలో జరుగుతున్న వివిధ ఆలిండియా టోర్నీలో పాల్గొంటూ ప్రతిభకు మెరుగులు దిద్దుకునే ప్రయత్నం చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించ రాదని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఇంటక్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు సోమవారం కలెక్ట రేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఉక్కు యాజమాన్యం ఏ కారణం చూపకుండా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుందని, దీంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు వంశీకృష్ణ, భాస్కరరావు, భైరెడ్డి అప్పారావు, నగేశ్, నాగిరెడ్డి ఉన్నారు.

ఉక్కు రక్షణ కోసం 27న మే డే మార్చ్

స్టీల్‌ప్లాంట్ రక్షణను కాంక్షిస్తూ ఈ నెల 27న మే డే మార్చ్‌ను నిర్వహించనున్నట్టు 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు తెలిపారు. ఆ రోజు ఉదయం ఆరున్నర గంటలకు ప్లాంట్ తృష్ణా మైదానంలో మార్చ్ ప్రారంభమవుతుందన్నారు. టౌన్‌షిప్‌లోని వివిధ సెక్టార్ల మీదుగా ఐదు కిలోమీటర్ల మేర మార్చ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

- 29 సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

గాజువాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆటోనగర్ ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన విజయవాడ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు.

నిందితుల నుంచి 29 సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖలో విజయవాడకు చెందిన ఓ ముఠా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు విజయవాడ పోలీసులు ఇక్కడి పోలీసులకు సమాచారం అందించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి బెట్టింగ్‌లు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని విజయవాడ ప్రాంతానికి చెందిన సీహెచ్ మహేశ్, షేక్ యాసిన్, ఎం.సురేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్లు, కాలువలు

మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- వీఎంఆర్డీఏ చైర్మన్‌కు మానం ఆంజనేయులు కాలనీ వాసుల వినతి



వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

సిరిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్ రోడ్లు, కాలువలు మూసివేసిన వారిపై చర్యలు తీసుకొని కాలనీ ప్రజలకు ఆరోగ్య రక్షణ కల్పించాలని మానం ఆంజనేయులు కాలనీవాసులు సోమవారం వీఎంఆర్డీఏకు చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. మధురవాడ 7వ వార్డు మానం ఆంజనేయులు నగర్ సర్వే నెం 125/2, 126/2 ఈడబ్ల్యూఎస్ లేఅవుట్ నెంబర్ 87/97 ప్లాన్ ప్రకారం రోడు, డ్రైనేజీలు రూపకల్పన చేసి 325 కుటుంబాలకు 1998లో పట్టాలు మంజూరు చేశారన్నారు. గడిచిన ఆరు నెలల నుంచి ఒక వ్యక్తి సర్వే నెం 126/4లో ఉన్న భూమి తనదని అంగబలం, అర్థబలంతో దౌర్జన్యంతో ప్రభుత్వం నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలను బలవంతంగా తొలగించి రోడ్లకు అడ్డంగా ప్రహరీ నిర్మించాడని పిర్యాదు చేశారు. దీంతో వీఎంఆర్డీఏ ప్లాన్ ప్రకారం ఎగువ నుంచి వచ్చే మురుగునీరు దిగువకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వీఎంఆర్డీఏ చైర్మన్‌కు కాలనీ వాసులు తెలిపారు. దీనిపై చైర్మన్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో ఆ ప్రాంతంలో క్షేత్ర పర్యటన చేసి శాశ్వత పరిష్కారం చుపుతామని హామీ ఇచ్చినట్టు కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బి.సురేష్, జేడీ నాయుడు, సీహెచ్వె_నాయుడు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మంజులను అభినందిస్తున్న అధ్యాపకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఆర్.మంజుల సోమవారం బాధ్యతలు చేపట్టారు.ఈమె భీమునిపట్నం ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇటీవల ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా మంజులను ప్రభుత్వ మహిళా కళాశాలకు పూర్తి స్థాయి ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ సందర్భంగా మంజులకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఏపీఎంఈఎస్ఏలో పలువురి చేరిక



ఏపీఎంఈఎస్ఏలో చేరిన సభ్యులు

సిరిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయం జమ్సు హాలులో సోమవారం సాయంత్రం జీవీఎంసీ డ్ఫెడర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రామానారాయణ, అధ్యక్షుడు యు.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో 54 మంది సభ్యులు ఏపీఎంఈఎస్ఏలో చేరినట్టు సంఘం జనరల్ సెక్రటరీ ఈతలపాక గణపతి తెలిపారు.

కార్యక్రమంలో ఏపీఎంఎస్ఈఏ జనరల్ సెక్రటరీ అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి ఎం.రవి, ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఈ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన సదస్సు



వక్ఫ్ సవరణ చట్టం-2025 కరపత్రం విడుదల చేస్తున్న ఎంఎంఎస్ పరశురామ రాజు తదితరులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగర బీజేపీ కార్యాలయంలో సోమవారం బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ నూర్ బాషా షరీఫ్ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టం-2025 సారాంశం వివరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ్ రాజు విచ్చేసి వక్ఫ్ సవరణ చట్టం-2025 కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతాడ మోహన్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సుహాసిని ఆనంద్, ఎస్.సన్యాసిరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్ యాదవ్, పోలిమేర శ్రీనివాసరావు, శ్రీరంగం ధనేశ్వరరావు, ఇతర నాయకులు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ఉపాధ్యాయులతో బహుమతులు పొందిన విద్యార్థులు

ఆరిలోవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులం, కళాశాల విద్యార్థులు విజయవాడలోని డ్రీమ్ వర్క్ ఆర్ట్స్ గ్యాలరీ నిర్వహించిన ఆర్ట్, పెయింటింగ్ పోటీలో పాల్గొని పలు బహుమతులు పొందారు. ఈ పోటీల్లో 16 గోల్డ్, 12 సిల్వర్‌మెడల్స్ తమ విద్యార్థులు పొందినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు.

ఈ మెడల్స్‌ను రోటరీ క్లబ్ కార్యదర్శి మణిమాల అందించినట్టు తెలిపారు. వీరికి మంచి తర్ఫీదు ఇచ్చిన ఆర్ట్ టీచర్ సుధాకర్‌ను ఈ సందర్భంగా ఉత్తమ ఉత్తమ టీచర్ ఆవార్డు ఇచ్చి సత్కరించారు.

ఈ సందర్భంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త ప్రభావతమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ టీకే రమేశ్ తదితరులు పతకాలు సాధించిన విద్యార్థులు, డ్రాయింగ్ టీచర్‌ను అభినందించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మురళీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మాధవధార క్రికెట్ క్లబ్ అధ్వర్యంలో సోమవారం వార్షిక క్రికెట్ పోటీలను టీడీపీ అధికార ప్రతినిధి ఎస్.వరప్రసాద్ ప్రారంభించారు. మింది దగ్గరి జింక్ గ్రౌండ్‌లో పోటీలను నిర్వహిస్తున్నారు. 10 రోజుల టోర్నమెంట్ మే 1తో ముగియనున్నట్టు క్రికెట్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాధవధార మహిళా నాయకురాలు కె.శ్యామల, వాసు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్ శాఖల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి.

వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి జి.వెంకటరమణ నేతృత్వంలో జరుగుతున్న ఈ పోటీల్లో ఇంజనీరింగ్, సిగ్నల్ అండ్ టెలికాం, కమర్షియల్, ఆపరేటింగ్, టీఆర్డీ, ఈఎల్ఎస్, డీఎల్ఎస్, పర్సనల్, అకౌంట్స్ వంటి పలు విభాగాల నుంచి లిఫ్టర్లు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం లో రైల్వే స్పోర్ట్స్ మాజీ ప్రధాన కార్యదర్శి నగేష్, సీనియర్ లిఫ్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు పోటీల్లో 55 కిలోల విభాగంలో పి.అరవింద్ (సీఅండ్‌డబ్ల్యు), జి.ఉమామహేశ్వర రెడ్డి(ఇంజనీరింగ్), జి.గోపాలరావు (కమర్షియల్); 61 కిలోల కేటగిరిలో కె.శ్రీనివాస రావు(కమర్షియల్), ఎస్.సురేష్ (ఈఎల్ఎస్), జి.విజయ్‌కుమార్ (ఇంజనీరింగ్);67 కిలోల విభాగంలో వైఎస్ మూర్తి(ఇంజనీరింగ్),ఎన్.సంతోష్‌కుమార్ (ఇంజనీరింగ్),రవికుమార్(సీఅండ్‌డబ్ల్యు) స్వర్ణ,రజత,కాంస్య పతకాలు సాధించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.66 వేలు విలువైన 13.2 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్‌ఐలు రామారావు, కీర్తిరెడ్డి తమ సిబ్బందితో మంగళవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో ఢిల్లీకి చెందిన రేష్మా ఖాన్, మహ్మద్ ఇబ్రాన్, వికాస్‌కుమార్ అనే నిందితులు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

జనసేన కార్యకర్తకు ఆర్థిక సాయం

మహారాణిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలోని సరయూ జలపాతంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన జన సైనికుడు వడ్డాది నరసింహం కుటుంబానికి 36వ వార్డు కార్పొరేటర్ మేరీ జోన్స్ సోమవారం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షుడు పడమటి శ్రీనివాస్ గౌడ్, పూడ మధు, జక్కా వాసుదేవరావు, కాశేశ్వరరావు, నవీన్‌కుమార్, కనక మహాలక్ష్మి, విజయ, నజీరా, మాధురి, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

న్యూరో విభాగానికి పరికరాలు వితరణ

మహారాణిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని న్యూరో సర్జరీ విభాగానికి వైద్యుడు సుంకర బాలపరమేశ్వరరావు రూ. 8 లక్షల విలువ చేసే శస్త్ర చికిత్స పరికరాలను వితరణగా అందించారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులు ఆదిలక్ష్మి, సుబ్బలక్ష్మి, రాజగోపాల్, తదితరులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు వీటిని అందజేశారు. కార్యక్రమంలో న్యూరో సర్జరీ విభాగాధిపతి ప్రేమ్‌జిత్ రే, తదితరులు పాల్గొన్నారు

50 మంది రక్తదానం

మహారాణిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శక్తి ఎంపరింగ్ ఉమెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 50 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపరింగ్ ఉమెన్ అసోసియేషన్ ప్రతినిధి పైడి రజనీ, పద్మ, అపూర్వ, శ్రావ్య, కిరిటీ చంద్రమౌళి. నరేంద్ర, డాక్టర్ శ్రీనివాసులు, రమణ రాజు, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

'చందనోత్సవంలో బాలలకు కనీస సౌకర్యాలు కల్పించాలి'

సింహాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామి నిజరూప దర్శనం చందనోత్సవానికి వచ్చే చిన్నారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, దేవస్థానం అధికారులను కోరారు. ఈమేరకు సోమవారం కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ఒక ప్రకటన విడుదల చేశారు. క్యూలో పిల్లలకు పాలిచ్చు తల్లులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు.. అలాగే క్యూలో నిలిచి ఉండే పిల్లలకు తాగునీరు, వేడిపాలు, బిస్కెట్లు పంపిణీ చేయాలని సూచించారు. గర్భిణిలు, బాలింతలు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలు ఏర్పాట్లు చేయాలన్నారు.

జీవీఎంసీ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్



విద్యార్థులతో హెచ్ఎం లక్ష్మీనరస, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్పీ పేట హైస్కూలు ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు సోమవారం విద్యాశాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోని ఒకటోతరగతిలో చేర్పించడం, అయిదో తరగతి పూర్తయిన వారిని ఆపై తరగతిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యా సంవత్సరం ముగింపునకు చేరడం వల్ల పై తరగతులకు వెళ్ళే విద్యార్థుల ప్రవేశాలు మూడు రోజుల పాటు పూర్తి చేయనున్నారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు వచ్చి అడ్మిషన్లు తీసుకున్నారు. తమ పాఠశాలలో 22 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్టు హెచ్ఎం బి.లక్ష్మీనరస తెలిపారు. అలాగే ఎన్జీజీవోస్ కాలనీ, జగన్నాథపురంలోని ప్రాథమిక పాఠశాలలు, రైల్వే న్యూ కాలనీలోని కేవీఎం, జీవీఎంసీ పాఠశాలల్లో విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం, ఎంవీ ధర్మారావు, ఎంవీ విశ్వనాథం, రవికుమార్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కంచరపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందించడం జరుగుతుందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జీవీఎంసీ రామ్మూర్తిపంతుల పేట ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల పెంపు కోసం సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోటు పుస్తకాలు, నాణ్యమైన భోజనం తదితర వసతులు ఎన్నో కల్పిస్తున్నట్టు చెప్పారు. 'తల్లికి వందనం' పేరుతో ప్రతి విద్యార్థికి త్వరలో నగదు ప్రోత్సాహం అందించబడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం విధిగా ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం 100 మందికి ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎన్.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సీఆర్పీ చైతన్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకారం అందించండి

జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరింధర్ ప్రసాద్‌కు కార్పొరేటర్ కవిత వినతి



కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరింధర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కవిత

కంచరపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరింధర్ ప్రసాద్‌కు వార్డు కార్పొరేటర్ గంకల కవిత వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వార్డులో సమస్యలపై జిల్లా కలెక్టరుకు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా కవిత కొండవాలు గ్రామాలైన రాంజీ ఎస్టేట్, లాల్ బహదూర్ నగర్, ఇందిరా నగర్ తదితర గ్రామాల్లో రోడ్లు, కాలువలు అందుబాటులో లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వార్డులో క్షేత్ర పర్యటన చేసి మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో వర్షం పడితే మురుగంతా రోడ్లు, ఇళ్లల్లోకి ప్రవేశిస్తుందన్నారు. వీటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మంజులను అభినందిస్తున్న అధ్యాపకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఆర్.మంజుల సోమవారం బాధ్యతలు చేపట్టారు.ఈమె భీమునిపట్నం ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇటీవల ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా డాక్టర్ ఆర్.మంజులను ప్రభుత్వ మహిళా కళాశాలకు పూర్తి స్థాయి ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : జోన్ 4 జడ్సీ



వినతులు స్వీకరిస్తున్న జడ్సీ మల్లయ్యనాయుడు

జ్ఞానాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు తప్పని సరిగాహాజరుకావాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి ఆరు వినతులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ విభాగానికి 3, పట్టణ ప్రణాళికా విభాగానికి 1, వాటర్ సప్లయ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విభాగానికి 2 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఏఎం హెచ్ఓ కృష్ణంరాజు, ఏపీడీ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వే వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు



పోస్టర్ ఆవిష్కరించిన డీఆర్ఎం లలిత్ బొహ్రా, రైల్వే అధికారులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తూర్పు కోస్తా రైల్వే, వాల్తేరు డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణా శిబిరాల్లో ఐదు నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. రైల్వే ఉద్యోగుల పిల్లలకే కాకుండా ఇతరులకు కూడా పాల్గొనవచ్చన్నారు. వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ క్రమం తప్పకుండా ప్రతి ఏడాది వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించి వర్ధమాన ఔత్సాహికులను ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న చిన్నారులు ఉన్నత క్రీడాకారులుగా ఎదిగేందుకు ఇటువంటి శిక్షణా శిబిరాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, యోగా, వాలీబాల్ క్రీడాంశాలలో శిక్షణ ఉంటుందన్నారు. అయితే క్రికెట్, స్విమ్మింగ్, టెన్నిస్ క్రీడాంశాలకు నిర్దిష్ట ప్రవేశ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. వివరాలకు స్టేడియంలో ప్రధాన కార్యదర్శిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, శాంతారామ్, సలహాదారుడు మహరానా, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎం.హరినాథ్, జాయింట్ స్పోర్ట్స్ ఆఫీసర్ ఎ.అవినాష్, సహాయ క్రీడాధికారులు ఎస్‌హెచ్. పాటిల్, సాహు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష పాల్గొన్నారు.

ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం అబిద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 వసంతాల పూర్తయిన నేపథ్యంలో వీరంతా సమావేశమై అప్పుడు తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రస్తుతం తాము అనుభవిస్తున్న జీవితం, తమ గురువులు ప్రసాదించిన విద్య వల్లే అని కృతజ్ఞతలు తెలిపారు. ఆపై తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొని ఆనందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.రవికుమార్, ఎన్వీ రమణ, డి.అప్పలరాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

'వైద్యం, విద్య వ్యాపారంగా మారరాదు'

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేశ్

డాబాగార్డెన్స్ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వైద్యం, విద్య వ్యాపారంగా మారడమే వైద్య వ్యవస్థ అభివృద్ధికి ఆటంకమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేశ్ అన్నారు. సోమవారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ హరిప్రసాద్ మెమోరియల్ లెక్చర్, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఆరోగ్య రంగం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ - ప్రభావాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం అన్నది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతన్నారు. గత వందేళ్లలో ఫార్మా, వైద్య రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయని,అమెరికాలో 50 శాతం మందికి ఉచిత వైద్యం లభిస్తుందని చెప్పారు. మిగిలిన వారు ఇన్సూరెన్స్ ద్వారా వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఏపీలో ప్రభుత్వ వైద్యంపై మధ్య తరగతి ప్రజలకు నమ్మకం పోయిందని, ప్రస్తుత పరిస్థితికి ఇది కూడా కారణమన్నారు. కార్యక్రమంలో జీవీపీఐ హెచ్‌సీ అండ్ ఎంటీ మాజీ డీఎంఈ డైరెక్టర్ ఆపరేషన్స్ డాక్టర్ సత్య వరప్రసాద్, అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం కన్వీనర్ కామేశ్వరరావు, జీఎస్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.వి. రమేశ్

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి ఏర్పాట్లు

మధురవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే (జూన్ 12) నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు అందించడానికి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 351 ప్రాథమిక పాఠశాలలు, 23 ప్రాథమికోన్నత పాఠశాలలు, 61 ఉన్నత పాఠశాలలు, 3 కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం రోజునే కిట్లు అందించనున్నారు. ఒక్కొక్క కిట్‌లో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, బెల్టు, డిక్షనరీ ఉంటాయి. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారికి పాఠ్య, నోట్ పుస్తకాలు అందించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత అందిస్తారు. కిట్ల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో కమిటీలు వేశారు. జిల్లాస్థాయిలో సమగ్ర శిక్ష ఏపీసీ అధ్యక్షుడిగా, సీఎంఓ కన్వీనర్‌గా, జీసీడీఓ, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా, ఏఎల్ఎస్సీఓ సభ్యులుగా వ్యవహరిస్తారు. మండల స్థాయిలో ఎంఈఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీఎంఆర్‌డీ తదితరులు కమిటీగా ఉంటారు.

శివుడు కుడి కన్ను తెరిచినట్టు ప్రచారం

» భారీగా తరలివచ్చిన భక్తులు



శివుని విగ్రహం

ఆటోనగర్ (విశాఖపట్నం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని గాజువాక ఆటోనగర్‌లో గల స్వయంభూ శ్రీదుర్గా నాగ లింగేశ్వర ఆలయంలో సోమవారం ఉదయం అర్చకులు కన్నబాబు పూజలు నిర్వహిస్తుండగా...శివుని విగ్రహం ఎడమ కన్ను మూసి, కుడి కన్ను తెరిచి కనిపించడంతో సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. ఈ విషయం ఆ నోటా, ఈ నోటా ప్రచారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేవారు. అర్చకులు కన్నబాబు మాట్లాడుతూ పంచామృతాలు, విభూదితో అభిషేకం నిర్వహిస్తుండగా ఈ అద్భుతం జరిగిందన్నారు. ఇక్కడ సుబ్రహ్మణ్య స్వామి, నాగ బంధం, పురాతన పుట్ట, శ్రీదుర్గమ్మ మూడు దశాబ్దాల కిందట వెలసినట్టు అర్చకులు చెబుతున్నారు.



ఆలయంలో భక్తులు

ఉత్తుత్తి చలివేంద్రాలు!



మురళీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండుటెండల్లో బాటసారుల దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ఇంకా సిద్ధం కాలేదు. ఏప్రిల్ మూడో వారంలోకి వచ్చినా ఇంకా జీవీఎంసీ అధికారులు దాహార్తి తీర్చే చర్యలను వేగవంతం చేయలేదు. వారం రోజుల క్రితం మాధవధార, ఊర్వశి జంక్షన్, 48ఏ బస్‌రూట్ ప్రాంతాల్లో కేవలం కర్రల పందిరిగా పాకలు వేసి వదిలేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే చలివేంద్రాలు అందుబాటులోకి వచ్చినా, జీవీఎంసీ జోన్-5 పరిధి (జ్ఞానాపురం) వార్డుల్లో వాటి ఆచూకీ కానరావడంలేదు. చలివేంద్రాల కోసం వేసిన పందిళ్లు ఖాళీగా దర్శనమివ్వడంతో జనం విస్తుపోతున్నారు. ఎండల సమయంలో ఆ పందిళ్ల దగ్గరకు వెళ్లిన వారికి నీరు లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. బస్టాపుల పక్కన, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటైన చలివేంద్రాల్లో నీటిని ఏర్పాటుచేసి బాటసారుల దాహార్తి తీర్చాలని కోరుతున్నారు.

ఏయూ అధికారుల నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. అయితే, అందులో రెండు యూనిట్లకు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే నాలుగో సెమిస్టర్ సిలబస్ నుంచి ఇచ్చారు. మిగిలిన మూడు యూనిట్లు కూడా మూడో సెమిస్టర్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇవ్వడంతో విద్యార్థులు షాక్ తిన్నారు. ఈ విషయం విద్యార్థులు గుర్తించి ఇన్విజిలేటర్లకు తెలియజేశారు. పలు కాలేజీల్లోని ఇన్విజిలేటర్లు...ఏయూ అధికారులకు తెలియజేశారు. అయితే, పరీక్షను యథావిధిగా కొనసాగించాలని చెప్పారు. పరీక్షల విభాగం నిర్లక్ష్యం వల్ల సుమారు వేయి మందికిపైగా విద్యార్థులు ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఉన్నతాధికారులు ఈ సెక్షన్‌పై దృష్టిసారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటే తప్ప తప్పులకు బ్రేక్ పడేలా లేదంటున్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

... 5వ పేజీ తరువాయి

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మూడు రాజధానులు ఉండవని స్పష్టత వచ్చింది. అయినా ఆదాయంలో పెద్దగా తేడా రాలేదు. వేయి కోట్ల రూపాయల మార్కును కొనసాగిస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,047.74 కోట్ల ఆదాయం చూపించారు. గత ఏడాది కంటే కేవలం రూ.13 కోట్లు మాత్రమే రాబడి తగ్గింది. జిల్లాల విభజనలో భాగంగా రెండేళ్ల క్రితం అనకాపల్లి జిల్లాలో ఉన్న పెదగంట్యాడను తీసుకువచ్చి విశాఖ జిల్లాలో కలిపారు. దాంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సంఖ్య తొమ్మిది నుంచి పదికి పెరిగింది.

ఇప్పుడు అన్ని కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

ఈ నెల మొదటి వారంలో రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభించారు. జిల్లాకు ఒక కార్యాలయం చొప్పున మొదలుపెట్టగా తొలుత విశాఖలో సూపర్ బజారు ప్రాంగణంలోని ఆర్ఓలో శ్రీకారం చుట్టడం జరిగింది. కొద్దిగా ఇబ్బందులు ఉన్నా..అప్పుడప్పుడు సర్వర్ మొరాయిస్తున్నా ప్రభుత్వం స్లాట్ల ద్వారానే రిజిస్ట్రేషన్లు చేయాలని స్పష్టం చేసింది. దాంతో ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో స్లాట్ల ద్వారానే రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్టు డీఐజీ బాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

... 5వ పేజీ తరువాయి

పెంచి కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉందని అరకులోయ ప్రాంతానికి చెందిన ఎం.బుజ్జిబాబు ఆనందాన్ని వ్యక్తంచేశారు. బీఈడీ పూర్తయి పదేళ్లు అవుతోందని, ఇప్పటివరకూ ఒకే ఒక్క డీఎస్సీ రాశానని, మరోసారి రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని రాజ్యలక్ష్మి అనే అభ్యర్థిని పేర్కొన్నారు. పరీక్షకు సమయం తక్కువగా ఉన్నా అభ్యర్థులకు ఇచ్చిన మాట ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉందని బి.సుధారాణి అనే అభ్యర్థిని తెలిపారు.

వేలాది మంది నిరుద్యోగులు

ఉపాధ్యాయ పోస్టుల కోసం పోటీ పడే వారి సంఖ్య రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ఉత్తరాంధ్రలో అధికంగా ఉంది. చివరిసారిగా 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ విడుదలైంది. అప్పటి నుంచి నోటిఫికేషన్ లేకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. ఉమ్మడి విశాఖ జల్లాలో ఉపాధ్యా పోస్టులకు పోటీపడుతున్నవారు సుమారు 35 వేల నుంచి 40 వేల మంది వరకూ ఉండవచ్చునంటున్నారు.

వీఎంఆర్‌డీఏ ఈ-వేలంపై పెదవి విరుపు

... 5వ పేజీ తరువాయి

ఉండదని, అవసరమైన వారు పాడుకుంటారని అనుకున్నారు. కానీ ఇది కూడా సవ్యంగా సాగడం లేదు. వీఎంఆర్‌డీఏలో ఈ వ్యవహారాలు చూసే సిబ్బందిని కొందరు మచ్చిక చేసుకున్నారు. పాటదారుల సమాచారం వారు బయటకు చేరవేయడం ప్రారంభించారు. ఏదైనా డిమాండ్ ఉండి పాటకు పోటీ పెరుగుతుంటే...అవతల వైపు పాడుతున్న వారి వివరాలు (ఫోన్ నంబరు, పేరు) రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అందిస్తున్నారు. దాంతో ఆయా నంబర్లకు ఫోన్ చేసి, తాము ఎంతైనా పాడుకుంటామని, పోటీ పడితే నష్టమని, వెనక్కి తగ్గిపోతే 'బహుమానం' ఇస్తామని చెప్పి వారిని పోటీ నుంచి తప్పించడం మొదలుపెట్టారు. దీనివల్ల వీఎంఆర్‌డీఏకు అప్‌సెట్ ధర మీద ఎక్కువ రేటు రావడం ఆగిపోయింది. ఇలాంటి బెదిరింపుల వల్ల చాలామంది వీఎంఆర్‌డీఏ ప్లాట్లకు దరఖాస్తు చేయడం తగ్గించేశారు. మరోవైపు విశాఖ పరిసరాల్లో భూముల రేట్లు కూడా పెరిగిపోవడంతో అంతంత రేటు పెట్టి, వేలంలో పాడాల్సిన అవసరం ఏమిటని చాలామంది ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ-వేలం పాటకు ఆదరణ తగ్గిపోయింది.

ప్రత్యక్ష వేలంపై ఆలోచన చేస్తున్నాం

- ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

వీఎంఆర్‌డీఏ ఈ-వేలం పాటలపై చైర్మన్ ప్రణవ్ గోపాల్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా, అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో కొందరు వేలం పాటదారుల సమాచారం లీక్ చేస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. ఒకరిపై చర్యలు తీసుకుంటే మరొకరు లీక్ చేస్తారని, అందుకే వేలం పాటలు పూర్వంలాగే ప్రత్యక్ష విధానంలో నిర్వహించాలని ఆలోచిస్తున్నామని, దీనిపై అధికారులతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

హెల్త్ సిటీలో వీధి లైట్ల ఏర్పాటు



హెల్త్ సిటీలో వెలుగుతున్న వీధి లైట్లు

ఆరిలోవ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ హెల్త్ సిటీలో వీధి దీపాలు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతం లో వీధి లైట్లు వెలగకపోవడంతో ఈ ప్రాంతమంతా గాఢాంధకారం లో ఉండటం కాక ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. జీవీఎంసీ అధికారులు వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవడంతో ఈ ప్రాంతం దగదగ విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. కొన్ని రోజుల క్రితం చీకటి పడితే ఈ ప్రాంతంలో తిరగడానికి భయపడేవారమని, ఇప్పుడు నిర్భయంగా తిరిగే అవకాశం ఏర్పడిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా.. హెల్త్ సిటీకి వచ్చే రోగులు, బంధువులు ఇబ్బందులు తొలగాయంటూ ఆనందం చెబుతున్నారు.

యువతి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్ కాలనీకి చెందిన యువతి కనిపించడం లేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం.. మునపాటి ఈశ్వరరావు తన కుటుంబంతో కేజీహెచ్ కాలనీలో ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆమె కుమార్తె సమీపంలోని బంధువు ఇంటికి వెళ్లింది. వారింటి మేడపైకి వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. అయితే అక్కడ లేకపోవడంతో గుమనించి పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మురళీ పర్యవేక్షణలో అదృశ్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డీడీ హైగ్రేడ్ కూచిపూడి నృత్యకళాకారిణిగా లిపికారెడ్డి ఎంపిక



రామ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరానికి చెందిన కేపీ లికిక రెడ్డి కూచిపూడి నృత్య విభాగంలో బి హైగ్రేడ్ కళాకారిణిగా ఎంపిక అయింది. హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం జీవిత కూచిపూడి నృత్య కళాకారులకు సెలెక్షన్ నిర్వహించారు. ఈ ఆడిషన్లో లిపిక రెడ్డి ఎంపిక కావటంపై విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ అభినందించారు. లిపిక రెడ్డి ఇప్పటి వరకూ దేశ విదేశాల్లో సుమారు రెండు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సుమారు 150కి పైగా పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. దేశంలోమూడు వందలకు పైగా ప్రముఖ దేవాలయాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు, 38 వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సంగీత నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలేఖ‌మహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (భీమిలి), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 17, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 14, క్యారెట్ 34 దొండకాయలు 18, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాత)48, బరబాటి 22, ములంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 54, దొసకాయలు 22, వెల్లుల్లి (పెద్ది) 100, కొబ్బరి (పెద్ద) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, క్యాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్ద) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కీర పెండలం 26, బ్రకోలి 45, వనసపొట్టు 200, కొండమిరప 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్బూజా 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్డు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
లైవ్ ధర	100
డ్రెస్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

కనుమరుగవుతున్న పచ్చదనం

» సంరక్షణ కోసం నిధులు వెచ్చిస్తున్నా ఫలితం శూన్యం

» కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం



హనుమంతవాక జంక్షన్ నుంచి శ్రీకృష్ణాపురం వరకు గల డివైడర్ల మధ్యలో ఎండిన మొక్కలు

ఆరిలోవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : 'మొక్కలను కాపాడండి.. పచ్చదనం పెంచండి' అనే స్లోగన్ చెప్పడం కాదు ఆచరణలో చూపడానికి ప్రత్యేక కార్యాచరణ అవసరం. చెట్ల సంరక్షణకు ఓపిక ఉండాలి. కాస్త ఖర్చు కూడా అవుతుంది.

బీఆర్టీఎస్ రోడ్డులో పచ్చదనం పెంచి ఆహ్లాదకర వాతావరణం పెంపొందించే ఉద్దేశంతో డివైడర్ల మధ్యలో మొక్కలు నాటారు. ఇందులో భాగంగా హనుమంతవాక జంక్షన్ నుంచి శ్రీకృష్ణాపురం వరకు గల డివైడర్ల మధ్యలో మొక్కలు నాటారు. ఈ మొక్కలకు నీరును పోయడానికి కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. కానీ సదరు కాంట్రాక్టర్ డబ్బులు జేబులో వేసుకుని మొక్కలకు నీరును పోయడం మానేశాడు. దీంతో మొక్కలు ఎండిపోయి ఎండి పోతున్నాయి. దీంతో వేసవిలో ఆహ్లాదం మాట అటుంచితే, మొక్కల పేరుతో ప్రజాధనం వృథా అవుతోందని పలువురు అంటు న్నారు. అధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం ఎంపీకి వినతి



ఎంపీ శ్రీభరత్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి వద్ద ట్రాఫిక్ అధికమవడంతో పాదచారులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ ప్రాంతంలో ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ నగర ఎంపీ భరత్‌కు 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య వినతి పత్రం అందజేశారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి జాతీయ రహదారిపై ఫుట్ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలిండియా అంతర్ వర్సిటీ కిక్ బాక్సింగ్‌లో నితిన్‌కు పతకం

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహించిన బి.నితిన్ పతకం సాధించాడు. ఉత్తరప్రదేశ్, మీరట్‌లో జరిగిన ఈ టోర్నీలో నితిన్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి కాంస్య పతకం దక్కించుకున్నారు.

ఈ సందర్భంగా ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం విభాగాధిపతి ఎ.పల్లవి తన కార్యాలయంలో పతకం సాధించిన నితిన్‌తో పాటు కోచ్ ఆనందబాబును అభినందించారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో పతకం సాధించి ఏయూ ఖ్యాతిని పెంచారని అభినందించారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకోసం ప్రాథమిక పాఠశాలల సందర్శన



శ్రీకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో హెచ్ఎం పైడిరాజు, టీచర్లు

ఆరిలోవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి మండలం పరిధిలో గల ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులను ఆరో తరగతిలో చేరాలని కోరుతూ ఆదివి వరంలో గల జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు సోమవారం పలు పాఠశాలలను సందర్శించారు. ఇందులో భాగంగా శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఆరో తరగతిలో చేరాలంటూ వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఈ సెలవుల్లో అన్ని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి అక్కడ ఐదో తరగతి విద్యార్థులను చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నట్టు హెచ్ఎం పైడిరాజు తెలిపారు. ఈ నెల 23 వరకు ఈ విధంగా అడ్మిషన్ తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకూ 84 మంది విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశం పొందారని ఆయన తెలిపారు.

మల్టీ లెవర్ పార్కింగ్‌ను సందర్శించిన వీఎంఆర్‌డీఏ చైర్మన్



అధికారులకు సూచనలిస్తున్న చైర్మన్ ప్రణవ్ గోపాల్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏకు చెందిన డెక్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ప్రాంగణం, యూహెచ్‌ హాల్‌లను వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సోమవారం సందర్శించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా వీటిని ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ రెండు ప్రాజెక్టులు సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె. రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఇంజనీర్లు భవానీశంకర్, బలరామరాజు, మధుసూదన్, రామరాజు, దుర్గాప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి అరుదైన సర్జరీ

» పొత్తి కడుపులో ఏర్పడిన క్యాన్సర్‌కు శస్త్రచికిత్స

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఓయువకుడి పొత్తి కడుపులో ఏర్పడిన అరుదైన క్యాన్సర్‌కు హైపర్‌థెర్మిక్ పద్ధతిలో సర్జరీ చేసి ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఈ సర్జరీకి సంబంధించిన వివరాలను సోమవారం నూరారంలోని మల్లారెడ్డి నారాయణ క్యాన్సర్ ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన ఆస్పత్రి వైద్యులు సీనియర్ సర్జికల్ అంకాలజీ డాక్టర్ హరీష్, సీనియర్ అనస్థటిస్టు డాక్టర్ జి. నరేంద్ర ప్రకాష్ వివరించారు. విశాఖపట్నంకు చెందిన గౌతమ్ కుమార్(24) తీవ్రమైన కడుప సమస్యతో జీవిత ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రిలో చేరినప్పుడు అతను ప్రైమరీ పెరిటోనియల్ ఎవింగ్స్ సార్కోమాతో సమస్యతో బాధపడుతున్నాడు. ఇది అసాధారణంగా అరుదైన, ప్రాణాంతకమైన వ్యాధిగా వైద్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో మల్టీడిసిప్లినరీ అంకాలజీ బృందం రోగికి 16 గంటల పాటు శస్త్ర చికిత్సను నిర్వహించారు. హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కీమోథెరపీ పద్ధతిలో సర్జరీ చేశారు. ఈ విధానం అనేక మైక్రోస్కోపిక్ క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో సహాయపడుతుందని, ఆరోగ్యకరమైన కణజాలాలకు నష్టాన్ని తగ్గించడంలో ఔషధ సామర్థ్యాన్ని పెంచుతుందని చెప్పారు. అండాశయం, కొలొరెక్టల్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్లు, సూడోమిక్సోమా పెరిటోని, మెసోథెలియోమా, కొన్ని అరుదైన సార్కోమాస్ వంటి ఉదర క్యాన్సర్లకు చికిత్స చేయడంలో ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. అరుదైన, అత్యంత కీలకమైన కేసులను నమ్మకంగా, జాగ్రత్తగా చికిత్స అందిస్తున్నట్టు మల్లా రెడ్డి గ్రూప్ చైర్మన్ భద్రారెడ్డి వ్యాఖ్యానించారు. పెరిటోనియల్ ఎవింగ్ సార్కోమాను ఆధునిక పద్ధతిలో చికిత్స చేయడం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో చాలా అరుదు అని మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రీతీ రెడ్డి తెలిపారు.

టీచర్లు వైద్య పరీక్షలకు హాజరు కావాల్సిందే..

» మెడికల్ సర్టిఫికెట్ ఆధారం గానే ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు

» డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ విద్యాశాఖ ఆదేశాల మేరకు పూర్వపు విశాఖ జిల్లా పరిధిలో గల ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, మున్సిపాలిటీ,మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ రెగ్యులేషన్ యాక్ట్-2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరి/స్పెషల్ పాయింట్లు పొందవలసినవారు తప్పనిసరిగా మెడికల్ క్యాంప్‌నకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కేజీహెచ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయుల తమ పాత ఆరోగ్య పరిస్థితి సర్టిఫికెట్లు సంబంధిత వైద్యులకు చూపించి, తాజాగా వైద్యులతో వైద్య పరీక్షలు చేయించుకుని కొత్త సర్టిఫికెట్లను తీసుకోవాలని కోరారు. ఈ క్యాంప్‌లో పొందిన ఆరోగ్య సర్టిఫికెట్ ఆధారంగా మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరి, స్పెషల్ పాయింట్ వర్తింప జేయడం జరుగుతుందన్నారు. విశాఖ జిల్లా వారికి ఈ నెల 24న, 25న అనకాపల్లి జిల్లా వారికి, 26న అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యాయులకు మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్టు డీఈవో తెలిపారు.

మైసూర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో రాణిస్తున్న రమణయ్య



విశాఖపట్నం, స్పోర్ట్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సూపర్ సీనియర్స్ మైసూర్ ఓపెన్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన పి.వెంకటరమణయ్య అద్భుతంగా రాణిస్తున్నారు. మైసూర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో 65 ప్లస్ ఏళ్ల విభాగం డబుల్స్‌లో పోరాట పటిమను ప్రదర్శించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు. తన పార్టనర్ రంజిత్ లంకతో కలిసి డబుల్స్ ఆడుతున్న రమణయ్య..ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో వేణుగోపాల్-హసమత్ జంటపై 2-0 స్కోరుతో, రెండో రౌండ్‌లో తమ ప్రత్యర్థులపై 2-1 స్కోరుతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు. త్వరలో జర్మనీలో జరగనున్న వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్‌కు సిద్ధమవుతున్న రమణయ్య...65 ఏళ్ల దాటిన వయసులో కూడా దేశంలో జరుగుతున్న వివిధ ఆలిండియా టోర్నీలో పాల్గొంటూ ప్రతిభకు మెరుగులు దిద్దుకునే ప్రయత్నం చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించ రాదని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఐఎన్‌టీయూసీ ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు సోమవారం కలెక్ట రేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఉక్కు యాజమాన్యం ఏ కారణం చూపకుండా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుందని, దీంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు వంశీకృష్ణ, భాస్కరరావు, భైరెడ్డి అప్పారావు, నరేశ్, నాగిరెడ్డి ఉన్నారు.

ఉక్కు రక్షణ కోసం 27న మేడే మార్చ్

స్టీల్‌ప్లాంట్ రక్షణను కాంక్షిస్తూ ఈ నెల 27న మే డే మార్చ్‌ను నిర్వహించనున్నట్టు 78వ వార్డు కార్పొరేటర్ బీ.గంగారావు తెలిపారు. ఆ రోజు ఉదయం ఆరున్నర గంటలకు ప్లాంట్ తృష్ణా మైదానంలో మార్చ్ ప్రారంభమవుతుందన్నారు. టౌన్‌షిప్‌లోని వివిధ సెక్టార్ల మీదుగా ఐదు కిలోమీటర్ల మేర మార్చ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

29 సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

గాజువాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆటోనగర్ ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడిన విజయవాడ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి 29 సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖలో విజయవాడకు చెందిన ఓ ముఠా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు విజయవాడ పోలీసులు ఇక్కడి పోలీసులకు సమాచారం అందించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి బెట్టింగ్‌లు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని విజయవాడ ప్రాంతానికి చెందిన సీహెచ్ మహేశ్, షేక్ యాసిన్, ఎం.సురేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్లు, కాలువలు

మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

» వీఎంఆర్డీఏ చైర్మన్‌కు మానం ఆంజనేయులు కాలనీ వాసుల వినతి



వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

సిరిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్ రోడ్లు, కాలువలు మూసివేసిన వారిపై చర్యలు తీసుకుని కాలనీ ప్రజలకు ఆరోగ్య రక్షణ కల్పించాలని మానం ఆంజనేయులు కాలనీవాసులు సోమవారం వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. మధురవాడ 7వ వార్డు మానం ఆంజనేయులు నగర్ సర్వే నెం 125/2, 126/2 ఈడబ్ల్యూఎస్ లేఅవుట్ నెంబర్ 87/97 ప్లాన్ ప్రకారం రోడ్డు, డ్రైనేజీలు రూపకల్పన చేసి 325 కుటుంబాలకు 1998లో పట్టాలు మంజూరు చేశారన్నారు. గడిచిన ఆరు నెలల నుంచి ఒక వ్యక్తి సర్వే నెం 126/4లో ఉన్న భూమి తనదని అంగబలం, అర్థబలంతో దౌర్జన్యంతో ప్రభుత్వం నిర్మించిన రోడ్డు, డ్రైనేజీలను బలవంతంగా తొలగించి రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించడని ఫిర్యాదు చేశారు. దీంతో వీఎంఆర్డీఏ ప్లాన్ ప్రకారం ఎగువ నుంచి వచ్చే మురుగునీరు దిగువకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వీఎంఆర్డీఏ చైర్మన్‌కు కాలనీ వాసులు తెలిపారు. దీనిపై చైర్మన్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో ఆ ప్రాంతంలో క్షేత్ర పర్యటన చేసి శాశ్వత పరిష్కారం చుపుతామని హామీ ఇచ్చినట్టు కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బి.సురేష్, జేడీ నాయుడు, సీహెచ్.నాయుడు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మంజులను అభినందిస్తున్న అధ్యాపకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఆర్.మంజుల సోమవారం బాధ్యతలు చేపట్టారు.ఈమె భీమునిపట్నం ఎస్ఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇటీవల ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా మంజులను ప్రభుత్వ మహిళా కళాశాలకు పూర్తి స్థాయి ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ సందర్భంగా మంజులకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఏపీఎంఈఎస్ఏలో పలువురి చేరిక



ఏపీఎంఈఎస్ఏలో చేరిన సభ్యులు

సిరిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయం జమ్న హాలులో సోమవారం సాయంత్రం జీవీఎంసీ డ్రైవర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రామనారాయణ, అధ్యక్షుడు యు.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో 54 మంది సభ్యులు ఏపీఎంఈఎస్ఏలో చేరినట్టు సంఘం జనరల్ సెక్రటరీ ఈతలపాక గణపతి తెలిపారు.

కార్యక్రమంలో ఏపీఎంఈఎస్ఏ జనరల్ సెక్రటరీ అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి ఎం.రవి, ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఈ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన సదస్సు



వక్ఫ్ సవరణ చట్టం-2025 కరపత్రం విడుదల చేస్తున్న ఎంఎల్‌సీ పరశురామ రాజు తదితరులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగర బీజేపీ కార్యాలయంలో సోమవారం బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ నూర్ బాషా పఠాన్ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టం-2025 పరంగా వివరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎల్‌సీ పరశురామ్ రాజు విచ్చేసి వక్ఫ్ సవరణ చట్టం-2025 కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల మోహనరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సుహాసిని ఆనంద్, ఎన్.సన్యాసిరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్ యాదవ్, పోలిమేర శ్రీనివాసరావు, శ్రీరంగం దినేష్‌కుమార్, ఇతర నాయకులు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ఉపాధ్యాయులతో బహుమతులు పొందిన విద్యార్థులు

ఆరిలోవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులం, కళాశాల విద్యార్థులు విజయవాడలోని డ్రీమ్ వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో పాల్గొని పలు బహుమతులు పొందారు. ఈ పోటీల్లో 16 గోల్డ్, 12 సిల్వర్‌మెడల్స్ తమ విద్యార్థులు పొందినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. ఈ మెడల్స్‌ను రోటరీ క్లబ్ కార్యదర్శి మణిమాల అందించినట్టు తెలిపారు. వీరికి మంచి శిక్షణ ఇచ్చిన ఆర్ట్ టీచర్ సుధాకర్‌ను ఈ సందర్భంగా ఉత్తమ ఉత్తమ టీచర్ అవార్డు ఇచ్చి సత్కరించారు.

ఈ సందర్భంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త ప్రభావతమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ బీ రమేశ్ తదితరులు పతకాలు సాధించిన విద్యార్థులు, డ్రాయింగ్ టీచర్‌ను అభినందించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మురళీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మాధవధార క్రికెట్ క్లబ్ అధ్వర్యంలో సోమవారం వార్షిక క్రికెట్ పోటీలను టీడీపీ అధికార ప్రతినిధి ఎస్.వరప్రసాద్ ప్రారంభించారు. మింది దగ్గరి జింక్ గ్రౌండ్‌లో పోటీలను నిర్వహిస్తున్నారు. 10 రోజుల టోర్నమెంట్ మే 1తో ముగియనున్నట్టు క్రికెట్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాధవధార మహిళా నాయకురాలు కె.శ్యామల, వాసు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్ శాఖల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి.

వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి జి.వెంకటరమణ నేతృత్వంలో జరుగుతున్న ఈ పోటీల్లో ఇంజనీరింగ్, సిగ్నల్ అండ్ టెలికాం, కమర్షియల్, ఆపరేటింగ్, టీఆర్డీ, ఈఎల్ఎస్, డీఎల్ఎస్, పర్సనల్, అకౌంట్స్ వంటి పలు విభాగాల నుంచి లిఫ్టర్లు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం లో రైల్వే స్పోర్ట్సు మాజీ ప్రధాన కార్యదర్శి నగేష్, సీనియర్ లిఫ్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు పోటీల్లో 55 కిలోల విభాగంలో పి.అరవింద్ (సీఅండ్‌డబ్ల్యు), జి.ఉ మామహేశ్వర రెడ్డి(ఇంజనీరింగ్), జి.గోపాలరావు (కమర్షియల్); 61 కిలోల కేటగిరిలో కె.శ్రీనివాస రావు(కమర్షియల్), ఎస్.సురేష్ (ఈఎల్ఎస్), జి.విజయ్‌కుమార్ (ఇంజనీరింగ్);67 కిలోల విభాగంలో వైఎస్ మూ ర్తి(ఇంజనీరింగ్),ఎన్.సంతోష్‌కుమార్ (ఇంజనీరింగ్),రవికుమార్(సీఅండ్‌డబ్ల్యు) స్వర్ణ,రజత,కాంస్య పతకాలు సాధించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.66 వేలు విలువైన 13.2 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్ఐలు రామారావు, కీర్తిరెడ్డి తమ సిబ్బందితో మంగళవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో ఢిల్లీకి చెందిన రేష్మా ఖాన్, మహ్మద్ ఇబ్రాన్, వికాస్‌కుమార్ అనే నిందితులు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

జనసేన కార్యకర్తకు ఆర్థిక సాయం

మహారాణిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలోని సరయూ జలపాతంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన జన సైనికుడు వద్దాది నరసింహం కుటుంబానికి 36వ వార్డు కార్పొరేటర్ మేరీ జోన్స్ సోమవారం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షుడు పడమటి శ్రీనివాస్ గౌడ్, పూడ మధు, జక్కా వాసుదేవరావు, కాశేశ్వరరావు, నవీన్‌కుమార్, కనక మహాలక్ష్మి, విజయ, నజీరా, మాధురి, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

న్యూరో విభాగానికి పరికరాలు వితరణ

మహారాణిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని న్యూరో సర్జరీ విభాగానికి వైద్యుడు సుంకర బాలపరమేశ్వరరావు రూ. 8 లక్షల విలువ చేసే శస్త్ర చికిత్స పరికరాలను వితరణగా అందించారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులు ఆదిలక్ష్మి, సుబ్బలక్ష్మి, రాజగోపాల్, తదితరులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు వీటిని అందజేశారు. కార్యక్రమంలో న్యూరో సర్జరీ విభాగాధిపతి ప్రేమ్‌జిత్ రే, తదితరులు పాల్గొన్నారు

50 మంది రక్తదానం

మహారాణిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శక్తి ఎంపరింగ్ ఉమెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 50 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపరింగ్ ఉమెన్ అసోసియేషన్ ప్రతినిధి పైడి రజనీ, పద్మ, అపూర్వ, శ్రావ్య, కిరిటీ చంద్రమౌళి. నరేంద్ర, డాక్టర్ శ్రీనివాసులు, రమణ రాజు, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

'చందనోత్సవంలో బాలలకు కనీస సౌకర్యాలు కల్పించాలి'

సింహాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామి నిజరూప దర్శనం చందనోత్సవానికి వచ్చే చిన్నారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, దేవస్థానం అధికారులను కోరారు. ఈమేరకు సోమవారం కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ఒక ప్రకటన విడుదల చేశారు. క్యూలో పిల్లలకు పాలిచ్చు తల్లులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు.. అలాగే క్యూలో నిలిచి ఉండే పిల్లలకు తాగునీరు, వేడిపాలు, బిస్కెట్లు పంపిణీ చేయాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలు ఏర్పాట్లు చేయాలన్నారు.

జీవీఎంసీ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్


విద్యార్థులతో హెచ్ఎం లక్ష్మీనరస, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్పీ పేట హైస్కూలు ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు సోమవారం విద్యాశాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోని ఒకటోతరగతిలో చేర్పించడం, అయిదో తరగతి పూర్తయిన వారిని ఆ పై తరగతిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యా సంవత్సరం ముగింపునకు చేరడం వల్ల పై తరగతులకు వెళ్ళే విద్యార్థుల ప్రవేశాలు మూడు రోజుల పాటు పూర్తి చేయనున్నారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు వచ్చి అడ్మిషన్లు తీసుకున్నారు. తమ పాఠశాలలో 22 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్టు హెచ్ఎం బి.లక్ష్మీనరస తెలిపారు. అలాగే ఎన్జీజీవోస్ కాలనీ, జగన్నాథపురంలోని ప్రాథమిక పాఠశాలలు, రైల్వే న్యూ కాలనీలోని కేఎన్ఎం, జీవీఎంసీ పాఠశాలల్లో విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం, ఎంవీ ధర్మారావు, ఎంవీ విశ్వనాథం, రవికుమార్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కంచరపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందించడం జరుగుతుందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జీవీఎంసీ రామ్మూర్తిపంతుల పేట ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల పెంపు కోసం సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, నోటు పుస్తకాలు, నాణ్యమైన భోజనం తదితర వసతులు ఎన్నో కల్పిస్తున్నట్టు చెప్పారు. 'తల్లికి వందనం' పేరుతో ప్రతి విద్యార్థికి త్వరలో నగదు ప్రోత్సాహం అందించబడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం విధిగా ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం 100 మందికి ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎన్.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సీఆర్పీ చైతన్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకారం అందించండి

జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరింధర్ ప్రసాద్‌కు కార్పొరేటర్ కవిత వినతి

కంచరపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరింధర్ ప్రసాద్‌కు వార్డు కార్పొరేటర్ గంకల కవిత వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వార్డులో సమస్యలపై జిల్లా కలెక్టరుకు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా కవిత కొండవాలు గ్రామాలైన రాంజీ ఎస్టేట్, లాల్ బహదూర్ నగర్, ఇందిరా నగర్ తదితర గ్రామాల్లో రోడ్లు, కాలువలు అందుబాటులో లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వార్డులో క్షేత్ర పర్యటన చేసి మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో వర్షం పడితే మురుగంతా రోడ్లు, ఇళ్లల్లోకి ప్రవేశిస్తుందన్నారు. వీటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు.


కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరింధర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కవిత

మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల బాధ్యతల స్వీకారం


బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మంజులను అభినందిస్తున్న అధ్యాపకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఆర్.మంజుల సోమవారం బాధ్యతలు చేపట్టారు.ఈమె భీమునిపట్నం ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇటీవల ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా డాక్టర్ ఆర్.మంజులను ప్రభుత్వ మహిళా కళాశాలకు పూర్తి స్థాయి ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : జోన్ 4 జడ్సీ

జ్ఞానాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు తప్పని సరిగాహాజరుకావాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి ఆరు వినతులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ విభాగానికి 3, పట్టణ ప్రణాళికా విభాగానికి 1, వాటర్ సప్లయ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విభాగానికి 2 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఏఎం హెచ్ఓ కృష్ణంరాజు, ఏపీడీ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న జడ్సీ మల్లయ్యనాయుడు

నేటి నుంచి రైల్వే వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తూర్పు కోస్తా రైల్వే, వాల్తేరు డివిజన్ స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణా శిబిరాల్లో ఐదు నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. రైల్వే ఉద్యోగుల పిల్లలకే కాకుండా ఇతరులకు కూడా పాల్గొనవచ్చన్నారు. వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ క్రమం తప్పకుండా ప్రతి ఏడాది వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించి వర్ధమాన ఔత్సాహికులను ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న చిన్నారులు ఉన్నత క్రీడాకారులుగా ఎదిగేందుకు ఇటువంటి శిక్షణా శిబిరాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, యోగా, వాలీబాల్ క్రీడాంశాలలో శిక్షణ ఉంటుందన్నారు. అయితే క్రికెట్, స్విమ్మింగ్, టెన్నిస్ క్రీడాంశాలకు నిర్దిష్ట ప్రవేశ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. వివరాలకు స్టేడియంలో ప్రధాన కార్యదర్శిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, శాంతారామ్, సలహాదారుడు మహరానా, స్పోర్ట్సు ఆఫీసర్ ఎం.హరినాథ్, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ ఎ.అవినాష్, సహాయ క్రీడాధికారులు ఎస్‌హెచ్. పాటిల్, సాహు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరించిన డీఆర్ఎం లలిత్ బొహ్రా, రైల్వే అధికారులు

ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం అబిద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 వసంతాల పూర్తయిన నేపథ్యంలో వీరంతా సమావేశమై అప్పుడు తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రస్తుతం తాము అనుభవిస్తున్న జీవితం, తమ గురువులు ప్రసాదించిన విద్య వల్లే అని కృతజ్ఞతలు తెలిపారు. ఆపై తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొని ఆనందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.రవికుమార్, ఎన్వీ రమణ, డి.అప్పలరాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

'వైద్యం, విద్య వ్యాపారంగా మారరాదు'

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేశ్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వైద్యం, విద్య వ్యాపారంగా మారడమే వైద్య వ్యవస్థ అభివృద్ధికి ఆటంకమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేశ్ అన్నారు. సోమవారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ హరిప్రసాద్ మెమోరియల్ లెక్చర్, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఆరోగ్య రంగం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ - ప్రభావాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం అన్నది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతన్నారు. గత వందేళ్లలో ఫార్మా, వైద్య రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయని,అమెరికాలో 50 శాతం మందికి ఉచిత వైద్యం లభిస్తుందని చెప్పారు. మిగిలిన వారు ఇన్సూరెన్స్ ద్వారా వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఏపీలో ప్రభుత్వ వైద్యంపై మధ్య తరగతి ప్రజలకు నమ్మకం పోయిందని, ప్రస్తుత పరిస్థితికి ఇది కూడా కారణమన్నారు. కార్యక్రమంలో జీవీపీఎ హెచ్‌సీ అండ్ ఎంటీ మాజీ డీఎంఈ డైరెక్టర్ ఆపరేషన్స్ డాక్టర్ సత్య వరప్రసాద్, అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం కన్వీనర్ కామేశ్వరరావు, జీఎస్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.వి. రమేశ్

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి ఏర్పాట్లు

మధురవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే (జూన్ 12) నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు అందించడానికి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 351 ప్రాథమిక పాఠశాలలు, 23 ప్రాథమికోన్నత పాఠశాలలు, 61 ఉన్నత పాఠశాలలు, 3 కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం రోజునే కిట్లు అందించనున్నారు. ఒక్కొక్క కిట్‌లో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, బెల్టు, డిక్షనరీ ఉంటాయి. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారికి పాఠ్య, నోట్ పుస్తకాలు అందించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత అందిస్తారు. కిట్ల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో కమిటీలు వేశారు. జిల్లాస్థాయిలో సమగ్ర శిక్ష ఏపీసీ అధ్యక్షుడిగా, సీఎంఓ కన్వీనర్‌గా, జీసీడీఓ, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా, ఏఎల్ఎస్సీఓ సభ్యులుగా వ్యవహరిస్తారు. మండల స్థాయిలో ఎంఈఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీఎంఆర్డీ తదితరులు కమిటీగా ఉంటారు.

శివుడు కుడి కన్ను తెరిచినట్టు ప్రచారం

» భారీగా తరలివచ్చిన భక్తులు

ఆటోనగర్ (విశాఖపట్నం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని గాజువాక ఆటోనగర్‌లో గల స్వయంభూ శ్రీదుర్గా నాగ లింగేశ్వర ఆలయంలో సోమవారం ఉదయం అర్చకులు కన్నబాబు పూజలు నిర్వహిస్తుండగా..శివుని విగ్రహం ఎడమ కన్ను మూసి, కుడి కన్ను తెరిచి కనిపించడంతో సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. ఈ విషయం ఆ నోటా, ఈ నోటా ప్రచారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేవారు. అర్చకులు కన్నబాబు మాట్లాడుతూ పంచామృతాలు, విభూదితో అభిషేకం నిర్వహిస్తుండగా ఈ అద్భుతం జరిగిందన్నారు. ఇక్కడ సుబ్రహ్మణ్య స్వామి, నాగ బంధం, పురాతన పుట్ట, శ్రీదుర్గమ్మ మూడు దశాబ్దాల కిందట వెలసినట్టు అర్చకులు చెబుతున్నారు.


శివుని విగ్రహం


ఆలయంలో భక్తులు

ఉత్తుత్తి చలివేంద్రాలు!

మురళీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండుటెండల్లో బాటసారుల దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ఇంకా సిద్ధం కాలేదు. ఏప్రిల్ మూడో వారంలోకి వచ్చినా ఇంకా జీవీఎంసీ అధికారులు దాహార్తి తీర్చే చర్యలను వేగవంతం చేయలేదు. వారం రోజుల క్రితం మాధవధార, ఊర్వశి జంక్షన్, 48ఎ బస్‌రూట్ ప్రాంతాల్లో కేవలం కర్రల పందిరిగా పాకలు వేసి వదిలేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే చలివేంద్రాలు అందుబాటులోకి వచ్చినా, జీవీఎంసీ జోన్-5 పరిధి (జ్ఞానాపురం) వార్డుల్లో వాటి ఆచూకీ కానరావడంలేదు. చలివేంద్రాల కోసం వేసిన పందిళ్లు ఖాళీగా దర్శనమివ్వడంతో జనం విస్తుపోతున్నారు. ఎండల సమయంలో ఆ పందిళ్ల దగ్గరకు వెళ్లిన వారికి నీరు లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. బస్టాపుల పక్కన, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటైన చలివేంద్రాల్లో నీటిని ఏర్పాటుచేసి బాటసారుల దాహార్తి తీర్చాలని కోరుతున్నారు.



ఏయూ అధికారుల నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. అయితే, అందులో రెండు యూనిట్లకు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే నాలుగో సెమిస్టర్ సిలబస్ నుంచి ఇచ్చారు. మిగిలిన మూడు యూనిట్లు కూడా మూడో సెమిస్టర్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇవ్వడంతో విద్యార్థులు షాక్ తిన్నారు. ఈ విషయం విద్యార్థులు గుర్తించి ఇన్విజిలేటర్లకు తెలియజేశారు. పలు కాలేజీల్లోని ఇన్విజిలేటర్లు...ఏయూ అధికారులకు తెలియజేశారు. అయితే, పరీక్షను యథావిధిగా కొనసాగించాలని చెప్పారు. పరీక్షల విభాగం నిర్లక్ష్యం వల్ల సుమారు వేయి మందికిపైగా విద్యార్థులు ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఉన్నతాధికారులు ఈ సెక్షన్‌పై దృష్టిసారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటే తప్ప తప్పులకు బ్రేక్ పడేలా లేదంటున్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

... 5వ పేజీ తరువాయి

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మూడు రాజధానులు ఉండవని స్పష్టత వచ్చింది. అయినా ఆదాయంలో పెద్దగా తేడా రాలేదు. వేయి కోట్ల రూపాయల మార్కును కొనసాగిస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,047.74 కోట్ల ఆదాయం చూపించారు. గత ఏడాది కంటే కేవలం రూ.13 కోట్లు మాత్రమే రాబడి తగ్గింది. జిల్లాల విభజనలో భాగంగా రెండేళ్ల క్రితం అనకాపల్లి జిల్లాలో ఉన్న పెదగంట్యాడను తీసుకువచ్చి విశాఖ జిల్లాలో కలిపారు. దాంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సంఖ్య తొమ్మిది నుంచి పదికి పెరిగింది.

ఇప్పుడు అన్ని కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

ఈ నెల మొదటి వారంలో రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభించారు. జిల్లాకు ఒక కార్యాలయం చొప్పున మొదలుపెట్టగా తొలుత విశాఖలో సూపర్ బజారు ప్రాంగణంలోని ఆర్ఓలో శ్రీకారం చుట్టడం జరిగింది. కొద్దిగా ఇబ్బందులు ఉన్నా..అప్పుడప్పుడు సర్వర్ మొరాయిస్తున్నా ప్రభుత్వం స్లాట్ల ద్వారానే రిజిస్ట్రేషన్లు చేయాలని స్పష్టం చేసింది. దాంతో ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో స్లాట్ల ద్వారానే రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్టు డీఐజీ బాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

... 5వ పేజీ తరువాయి

పెంచి కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉందని అరకులోయ ప్రాంతానికి చెందిన ఎం.బుజ్జిబాబు ఆనందాన్ని వ్యక్తంచేశారు. బీఈడీ పూర్తయి పదేళ్లు అవుతోందని, ఇప్పటివరకూ ఒకే ఒక్క డీఎస్సీ రాశానని, మరోసారి రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని రాజ్యలక్ష్మి అనే అభ్యర్థిని పేర్కొన్నారు. పరీక్షకు సమయం తక్కువగా ఉన్నా అభ్యర్థులకు ఇచ్చిన మాట ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉందని బి.సుధారాణి అనే అభ్యర్థిని తెలిపారు.

వేలాది మంది నిరుద్యోగులు

ఉపాధ్యాయ పోస్టుల కోసం పోటీ పడే వారి సంఖ్య రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ఉత్తరాంధ్రలో అధికంగా ఉంది. చివరిసారిగా 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ విడుదలైంది. అప్పటి నుంచి నోటిఫికేషన్ లేకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉపాధ్యా పోస్టులకు పోటీపడుతున్నవారు సుమారు 35 వేల నుంచి 40 వేల మంది వరకూ ఉండవచ్చునంటున్నారు.

వీఎంఆర్‌డీఏ ఈ-వేలంపై పెదవి విరుపు

... 5వ పేజీ తరువాయి

ఉండదని, అవసరమైన వారు పాడుకుంటారని అనుకున్నారు. కానీ ఇది కూడా సవ్యంగా సాగడం లేదు. వీఎంఆర్‌డీఏలో ఈ వ్యవహారాలు చూసే సిబ్బందిని కొందరు మచ్చిక చేసుకున్నారు. పాటదారుల సమాచారం వారు బయటకు చేరవేయడం ప్రారంభించారు. ఏదైనా డిమాండ్ ఉండి పాటకు పోటీ పెరుగుతుంటే...అవతల వైపు పాడుతున్న వారి వివరాలు (ఫోన్ నంబరు, పేరు) రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అందిస్తున్నారు. దాంతో ఆయా నంబర్లకు ఫోన్ చేసి, తాము ఎంతైనా పాడుకుంటామని, పోటీ పడితే నష్టమని, వెనక్కి తగ్గిపోతే 'బహుమానం' ఇస్తామని చెప్పి వారిని పోటీ నుంచి తప్పించడం మొదలుపెట్టారు. దీనివల్ల వీఎంఆర్‌డీఏకు అప్‌సెట్ ధర మీద ఎక్కువ రేటు రావడం ఆగిపోయింది. ఇలాంటి బెదిరింపుల వల్ల చాలామంది వీఎంఆర్‌డీఏ ప్లాట్లకు దరఖాస్తు చేయడం తగ్గించేశారు. మరోవైపు విశాఖ పరిసరాల్లో భూముల రేట్లు కూడా పెరిగిపోవడంతో అంతంత రేటు పెట్టి, వేలంలో పాడాల్సిన అవసరం ఏమిటని చాలామంది ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ-వేలం పాటకు ఆదరణ తగ్గిపోయింది.

ప్రత్యక్ష వేలంపై ఆలోచన చేస్తున్నాం

- ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

వీఎంఆర్‌డీఏ ఈ-వేలం పాటలపై చైర్మన్ ప్రణవ్ గోపాల్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా, అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో కొందరు వేలం పాటదారుల సమాచారం లీక్ చేస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. ఒకరిపై చర్యలు తీసుకుంటే మరొకరు లీక్ చేస్తారని, అందుకే వేలం పాటలు పూర్వంలాగే ప్రత్యక్ష విధానంలో నిర్వహించాలని ఆలోచిస్తున్నామని, దీనిపై అధికారులతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

చురుగ్గా గెడ్డల అభివృద్ధి పనులు

▸ రూ.5 కోట్లతో ఆధునీకీకరణ

▸ వానాకాలంలో ముంపు సమస్యలు ఉండదంటున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు


గాజువాక ప్రధాన గెడ్డ రిటెయినింగ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

గాజువాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న ప్రధాన గెడ్డల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రధానంగా జోనల్ పరిధిలో అధికశాతం ప్రధాన గెడ్డలు పదిహేనేళ్ల క్రితం నిర్మించినవే కావడంతో అవి పాడైపోయాయి. గాజువాకలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చే వాడుక నీరంతా ఆయా గెడ్డల ద్వారా గంగవరం సమీపంలో సముద్రంలో కలుస్తోంది. ఈ మేరకు గాజువాక నుంచి గంగవరం తీర ప్రాంతం వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల పొడవైన ప్రధాన గెడ్డకు చెందిన రిటెయినింగ్ వాల్స్ వర్షపు నీటి ప్రవాహానికి కోతకు గురయ్యాయి. పలుచోట్ల గెడ్డకు ఇరుపక్కలా ఉన్న మట్టిగోడలు సైతం కొట్టుకుపోవడంతో భారీ వర్షాల సమయంలో నీరు సమీప కాలనీల్లోకి చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ముంపు సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీంతో ఆయా వార్డుల కార్పొరేటర్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఈ మేరకు అధికారులు ముంపునకు గురయ్యే కాలనీలు, గెడ్డలను పరిశీలించి ఆయా గెడ్డల అభివృద్ధికి ఎంతమేర వ్యయమవుతుందో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలను జీవీఎంసీకి పంపారు. ప్రస్తుతం సుమారు రూ.ఐదు కోట్ల వ్యయంతో ప్రధాన గెడ్డలను అభివృద్ధి చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. వర్షాకాలంలోగా గెడ్డల అభివృద్ధి పనులు పూర్తయితే ముంపు సమస్యలు ఉండవని లోతట్టు ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు.

పీజీఆర్ఎస్‌లో 'పల్లా' వినతుల స్వీకరణ

▸ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశం


అర్జీదారునితో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా అధికారులకు పల్లా ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

గాజువాక జోన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, డ్రైనేజీల్లో మురుగు తిష్ట వేయకుండా చూడాలని, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని, పైపు లైన్లకు లీకేజీలు లేకుండా చూడాలని సూచించారు. కొండవాలు ప్రాంత ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరువ చేయాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదుల లేకుండా అందరూ చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమావేశంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

29 సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

గాజువాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆటోనగర్ ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన విజయవాడ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 29 సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖలో విజయవాడకు చెందిన ఓ ముఠా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు విజయవాడ పోలీసులు ఇక్కడి పోలీసులకు సమాచారం అందించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి బెట్టింగ్‌లు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని విజయవాడ ప్రాంతానికి చెందిన సీహెచ్ మహేశ్, షేక్ యాసిన్, ఎం.సురేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

'ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరు'

పెదగంట్యాడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరు సాగిస్తుందని గాజువాక సీపీఐ కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. సీపీఐ శాఖ మహాసభలు సోమవారం గంగవరంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అధిక భారం మోపుతుందని, వంట గ్యాస్ ధరను పెంచడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం సీపీఐ జాలరిపల్లిపాలెం శాఖకు కార్యదర్శిగా కె.పోతయ్య, గంగవరం కార్యదర్శిగా మాధవరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీచర్లు వైద్య పరీక్షలకు హాజరు కావాల్సిందే

▸ జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ విద్యాశాఖ ఆదేశాల మేరకు పూర్వపు విశాఖ జిల్లా పరిధిలో గల ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, మున్సిపాలిటీ.మున్సిపాల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ రెగ్యులేషన్ యాక్టు-2025 ప్రకారం ప్రిఫరెన్సియల్ కేటగిరి/ స్పెషల్ పాయింట్స్ పొందవలసినవారు తప్పనిసరిగా మెడికల్ క్యాంప్‌నకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు.

ఈ మేరకు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కేజీహెచ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయుల తమ పాత ఆరోగ్య పరిస్థితి సర్టిఫికెట్లు సంబంధిత వైద్యులకు చూపించి, తాజాగా వైద్యులతో వైద్య పరీక్షలు చేయించుకొని కొత్త సర్టిఫికెట్లను తీసుకోవాలని కోరారు. ఈ క్యాంపులో పొందిన ఆరోగ్య సర్టిఫికెట్ ఆదారంగా మాత్రమే ప్రిఫరెన్సియల్ కేటగిరి, స్పెషల్ పాయింట్ వర్తింప జేయడం జరుగుతుందన్నారు. విశాక జిల్లా వారికి ఈ నెల 24న, 25న అనకాపల్లి జిల్లా వారికి, 26న అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యాయులకు మెడికల్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్టు డీఈవో తెలిపారు.

సామూహిక సీమంతాలు


సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

ఆర్పీపేట(కంచరపాలెం),ఏప్రిల్ 21,(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56, 57, 52 వార్డులకు చెందిన గర్భిణీలకు సామూహిక సీమంతం కార్యక్రమాన్ని పైడయ్య కల్యాణ మండపంలో ఐసీడీఎస్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు అత్యుత్తమైనవని ఆయన కొనియాడారు. గర్భిణీలు, బాలింతలు తగిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని శిశువుల ఆరోగ్యవంతంగా జన్మించేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ సీడీపీవో ఎంవీ. రమణకుమారి మాట్లాడుతు పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలకు సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తల్లీ, బిడ్డలకు సరైన పౌష్టికాహారం సమయానికి అందిస్తున్నామని ఆమె తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా గర్భిణీలకు పసుపు, కుంకుమ, చీరలను అందంచారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు శరగడం రాజశేఖర్, ముర్రువాణితో పాటు పెంటకోట అజయ్‌బాబు,శ్రీరామూర్తినాగుల అప్పలరాజు,టాస్ హరినారాయణ ,అంగన్వాడీ సూపర్ వైజర్లు జ్యోతి,వరలక్ష్మీతో పాటు అంగన్వాడీ టీచర్లు తదితరలు పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్ కాదు... క్లీన్ బౌల్డ్'


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ న్యూడెమోక్రసీ సభ్యులు

పెందుర్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సుపర్ సిక్స్ హామీలు అమలులో కూటమి ప్రభుత్వం క్లీన్ బౌల్డ్ అయ్యిందని సీపీఐ న్యూడెమోక్రసీ కమిటీ కార్యదర్శి ఎమ్. వెంకటేశ్వరులు ఆరోపించారు. సోమవారం పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ఉన్న 176 హామీలు నెరవేర్చాలని, పట్టణాల్లో ఉండే పేదలకు రెండు సెంట్ల ఇళ్లస్థలం ఇవ్వాలని, నిరుద్యోగ భృతి నెలకు రూ. 3వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్ కేటాయింపులో సూపర్ సిక్స్ హామీలకు చిల్లు పెట్టారని ఆరోపించారు. తమ డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కి వినితిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటీ నాయకురాలు ఎస్. వెంకటలక్ష్మి, సీనియర్ నాయకులు వై.కొండయ్య, పీవోడబ్లు జిల్లా కార్యదర్శి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నూరేళ్లూ నిండాయి

మల్కాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ కార్మిక బీమా ఆస్పత్రి (ఈఎస్ఐ) ప్రాంగణంలో వందేళ్ల వయసున్న రావి చెట్టు ఆదివారం అర్ధరాత్రి నేలకొరిగింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ చెట్టు ఆస్పత్రికి వచ్చేవారికి ఎంతో నీడనిచ్చేదని, పెద్దపెద్ద వర్షాలను, ఈదురుగాలులను తట్టుకున్న చెట్టు ఇప్పుడు ఏ కారణం లేకుండానే కూలిపోయిందని స్థానికులు అంటున్నారు.


విరిగిపడిన రావిచెట్టు


ప్రశాంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

అంతర్జాతీయ వాలీబాల్ టోర్నీకి నగర వాసి

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ఇస్లామాబాద్‌లో జరిగే సెంట్రల్ ఏషియన్ వాలీబాల్ అసోసియేషన్ (కావా) సీనియర్ పురుషుల వాలీబాల్ లీగ్ 2025 టోర్నీకి భారత్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికైన నగర వాసి, అంతర్జాతీయ వాలీబాలర్ పి.ప్రశాంత్‌ను, ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ సంఘం అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక కావా భారత్ ప్రాబబుల్స్ జట్టుకు ప్రశాంత్ ఎంపిక కావడం విశాఖ వాలీబాల్ అసోసియేషన్‌కు గర్వకారణమని, తన ప్రతిభను నిరూపించుకుని తుది జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షిస్తున్నానని గణబాబు అన్నారు. కార్యక్రమంలో సీనియర్ వాలీబాలర్లు మోహన్, విఠల్ పాల్గొన్నారు.

ప్రైవేటు బడి వద్దు- ప్రభుత్వం బడి ముద్దు

అవగాహన ర్యాలీలో విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న హెచ్ఎం ప్రసాద్ విద్యార్థులు, తదితరులు

గోపాలపట్నం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు వద్దు- ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అంటూ నినాదాలు చేస్తూ గ్రేటర్ పరిధి 88వ వార్డు నరవ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా పాఠశాల హెచ్ఎం కె.ప్రసాద్ మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, నైపుణ్యం గల అధ్యాపకులు, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

నగరం నుంచి స్టీల్‌ప్లాంటుకు బస్ సర్వీసులను పునరుద్ధరించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం ప్రధాన గేటు వరకు ఆర్టీసీ బస్ సర్వీసులను పునరుద్ధరించాలని పలువురు ఉక్కు ఉద్యోగులు కోరుతున్నారు. గతంలో నగరం నుంచి ఇక్కడ వరకు బస్సులు నడిచేవని, ప్రస్తుతం వీటిని రద్దు చేయడం వల్ల అధిక మొత్తంలో నగదు చెల్లించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దు చేసిన బస్సులను పునరుద్ధరిస్తే ఆర్టీసీకి ఆదాయం రావడంతో పాటు ప్రజల ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఇంటక్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఉక్కు యాజమాన్యం ఏ కారణం చూపకుండా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుందని, దీంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు వంశీకృష్ణ, భాస్కరరావు, బైరెడ్డి అప్పారావు, నగేశ్, నాగిరెడ్డి ఉన్నారు.

ఉక్కు రక్షణ కోసం 27న మే డే మార్చ్

స్టీల్‌ప్లాంట్ రక్షణను కాంక్షిస్తూ ఈ నెల 27న మే డే మార్చ్‌ను నిర్వహించనున్నట్టు 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు తెలిపారు. ఆ రోజు ఉదయం ఆరున్నర గంటలకు ప్లాంట్ తృష్ణా మైదానంలో మార్చ్ ప్రారంభమవుతుందన్నారు. టౌన్‌షిప్‌లోని వివిధ సెక్టార్ల మీదుగా ఐదు కిలోమీటర్ల మేర మార్చ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

నూతన కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీ అభివృద్ధి సంక్షేమ సంఘం సోమవారం సమావేశమై 2024-26 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా ఎ.వీ.రాజు, ఉపాధ్యక్షులుగా కె.మురళీ, ఎ.శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శిగా జి.పార్వతీశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా వైఎస్ నాయుడు, కోటీశ్వరరావు కోశాధికారిగా టి.రామకృష్ణ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఈగలపాటి యువశ్రీ, బాపిరాజు శర్మలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేస్తుందని అధ్యక్ష కార్యదర్శులు ఎ.వీ.రాజు, పార్వతీశ్వరరావులు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

అగనంపూడి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి ట్రాఫిక్ సిగ్నల్ వద్ద స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జననీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు విందుల వెంకటరమణ ముఖ్యఅతిథిగా విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సత్యసాయి భజన మండలి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ చలివేంద్రాన్ని ప్రయాణికులతో పాటు పాదచారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో, భజన మండలి ప్రతినిధులు రామకృష్ణ, వి.పైడం నాయుడు, రాజునాయుడు, వి.రామారావు, రామన్, అల్లం శ్రీనివాసరావు, గుడే సుశీల గజేంద్రరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 17, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 34 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 54, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీర దోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	220


చంద్రనగర్ అండర్ పాస్‌వేపై షెల్టర్ ఏర్పాటు చేసిన దృశ్యం

అండర్ పాస్‌వేపై షెల్టర్ ఏర్పాటు

గోపాలపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వే స్టేషన్ వెనక భాగంలో చంద్రనగర్ వద్ద గత ఏడాది నిర్మించిన అండర్ పాస్‌వేపై షెల్టర్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. స్టేషన్ వెనక భాగంలో ఉన్న రైల్వే గేట్ల కారణంగా గోపాలపట్నం దిగువ ప్రాంతాలకు చెందిన సుమారు పది గ్రామాల ప్రజలు దశాబ్దాల కాలంగా ఇబ్బంది పడేవారు. ఈ క్రమంలో పాత గోపాలపట్నం, చంద్రనగర్ ప్రాంతాల్లోని రైల్వే గేట్లను తొలగించి ఈ ప్రాంతంలో అండర్ పాస్‌వేల నిర్మాణం చేపట్టారు. ఐదేళ్ల కిందట పాత గోపాలపట్నం వద్ద అండర్ పాస్‌వే నిర్మించగా, గత ఏడాది చంద్రనగర్ వద్ద మరో అండర్ పాస్‌వేను నిర్మించారు. అయితే వర్షాల సమయంలో చంద్రనగర్ అండర్ పాస్‌వేలోకి నీరు చేరి నిల్వ ఉండిపోతుండడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడేవారు. ఈక్రమంలో అండర్ పాస్‌వేలోకి వర్షపు నీరు చేరకుండా షెల్టర్‌ను ఏర్పాటు చేశారు.

ప్రతిపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి

బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

గాజువాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టంపై ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ భూముల ప్రయోజనాలను పేద ముస్లింలకు అందించేందుకే సవరణను తీసుకురావడం జరిగిందన్నారు. వక్ఫ్ చట్టంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు పొలిమేర శ్రీనివాస్, దీనంకొండ కృష్ణంరాజు, దిలీప్, నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెంటమాంబ మారువారం పండగ

పెదగంట్యాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నెల్లిముక్కులోని శ్రీపెంటమాంబ మారువారం పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. ఆలయ ఆవరణలో జరిగిపన హోమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, జనసేన నాయకుడు తిప్పల రమణారెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్లు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, జి.అప్పలరెడ్డి, జి.సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ధర్నా


ఆందోళనకారులనుద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ భుజంగరావు

మల్కాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ జీవో 30 ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ములగాడ తహశీల్దార్ కార్యాలయం దగ్గర నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 296, 388 ఇళ్ల పట్టాలు మంజూరు చేసినప్పుడు రెండేళ్ల తరువాత ఈ పట్టాలు రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉందని అయనన్నారు. కానీ ఇందుకు సంబంధించి జీవోను విడుదల చేయకపోవడం వల్ల రిజిస్ట్రేషన్‌లు చేసుకోలేకపోతున్నారని ఆవేదేన వ్యక్తం చేశారు. అనంతరం ములగాడ తహశీల్దార్ భుజంగరావు మాట్లాడుతూ జీవో నంబర్ 30 ప్రకారం 2019 అక్టోబరుకు ముందు దరఖాస్తు చేసుకున్నవారికి వెరిఫికేషన్ చేసి పట్టాలు మంజూరు చేస్తామన్నారు. అలాగే గ్యాస్ సబ్సిడీల సమస్య గురించి పౌరసరపరా అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

రిటెయినింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన

మల్కాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 59వ వార్డు హనుమాన్‌నగర్ కొండపై రిటెయినింగ్ వాల్ నిర్మాణానికి కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ తరుపున ఆమె భర్త పుర్రె సురేశ్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రిటెయినింగ్ వాల్ నిర్మాణం కోసం జీవీఎంసీ రూ.19 లక్షలు కేటాయించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నామన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి వితరణ

గోపాలపట్నం,ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి పాఠశాల పూర్వ విద్యార్థి దాడి వెంకట అప్పారావు రూ.70వేలు విరాళంగా అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఈ విరాళంతో తరగతి గదుల్లో ఫ్యాన్‌లు, లైట్లు, మరుగుదొడ్లలో ట్యాప్‌లను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులందరూ పాఠశాల అభివృద్ధికి చేయూతనందించాలని వారు కోరారు.

పీజీఆర్ఎస్‌కు 7 అర్జీలు

వేపగుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 7 అర్జీలు అందాయి. అనుమతులు లేని నిర్మాణాలను అడ్డుకోవాలని, రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలని, చినముషిడివాడ పార్కులోని సమస్యలను పరిష్కరించాలని, సుజాతా నగర్‌లో ప్రహరీ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఫిర్యాదులు వచ్చినట్టు జడ్సీ కె.హైమావతి తెలిపారు.

చిన్నారులకు నైపుణ్యాలను నేర్పిద్దాం

వేసవి సెలవుల్లో చదువుతో పాటు ప్రత్యేక అంశాలపై దృష్టి ఎంతో అవసరం



(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ఇప్పటికే పలు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం కాగా మరికొన్ని స్కూళ్లకు కొద్దిరోజుల్లోనే సెలవులు రాబోతున్నాయి. వేసవి సెలవులంటే పిల్లలు కాస్త రిలాక్స్ అవ్వాలని భావిస్తారు. కానీ ఎంతోమంది తల్లిదండ్రులు సెలవుల్లో కూడా తమ పిల్లలను చదువులు, ట్యూషన్లు అంటూ వారిని మరింత ఒత్తిడికి గురిచేసే ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే అటువంటి చర్యలు వల్ల పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతుంటారని నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి చదువుతో పాటు ప్రత్యామ్నాయ అంశాలపై వేసవి సెలవుల్లో చిన్నారులు దృష్టిసారించేలా చేయాలని సూచిస్తున్నారు. విభిన్నమైన అంశాల్లో పిల్లలు నైపుణ్యాలను సాధించేలా చేసేందుకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొంటున్నారు. ఇందుకోసం అనేక సంస్థలు కూడా వేసవి ప్రత్యేక క్రీడా శిబిరాలను, ట్రైనింగ్ సెషన్స్‌ను నిర్వహించేం దుకు సిద్ధమవుతున్నాయి. వీటిలో క్రీడలు, డ్యాన్స్, మ్యూజిక్‌తో పాటు పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదం చేసే అనేక అంశాలు ఉన్నాయని చెబుతున్నారు. విభిన్నమైన అంశాల్లో పిల్లలకు నైపుణ్యం ఉంటే వారిలో ఆత్మవిశ్వాసం కూడా పెంపొందుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులకు వేసవిలో నేర్పించేందుకు అవకాశం ఉన్న విభిన్నమైన అంశాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

- ఆటపాటలతో పాటు ప్రత్యేక నైపుణ్యాలను నేర్పించడం కీలకమంటున్న నిపుణులు
- డ్యాన్స్, మ్యూజిక్ వంటి వాటి పట్ల పిల్లలకు ఆసక్తి కల్పించే ప్రయత్నం చేయాలి
- మార్షల్ ఆర్ట్స్, ఇతర క్రీడల్లో చేర్పిస్తే మనోవికాసానికి ఎంతో దోహదం





ఇష్టాలను గుర్తించడం కీలకం

చిన్నారుల్లో ప్రతి ఒక్కరికి భిన్నమైన అంశం పట్ల ఆసక్తి ఉంటుంది. దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఇందుకు ఈ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడం అత్యంత కీలకం. కొందరు పిల్లలకు డ్యాన్స్ మ్యూజిక్ అంటే ఇష్టం ఉంటుంది. మరికొందరు క్రికెట్ అంటే ఎక్కువ ఆసకి చూపుతారు. ఇంకొందరు ఇతర క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తారు. కొందరికి సరికొత్త కోర్సులు, లాంగ్వేజ్‌లు నేర్చుకునేందుకు మక్కువ ఎక్కువ ఉంటుంది. అటువంటి వాటిల్లో కొన్ని వారాలపాటు పిల్లలకు శిక్షణ ఇప్పిస్తే మరింత ఉత్సాహంతో ప్రావీణ్యాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తారు. అందువల్ల చిన్నారుల ఇష్టాన్ని గుర్తించి, ప్రోత్సహించడం అత్యంత కీలకం. కాబట్టి పిల్లలతో కొన్ని గంటలపాటు మాట్లాడి వారి ఇష్టాలను తెలుసుకుని ఆయా నైపుణ్యాలను నేర్పించే ప్రయత్నం చేయాలి.

సెల్ ఫోన్లకు దూరం చేయాలి..

కొత్త విషయాలను నేర్పించే ప్రయత్నం చేయడం ఎంత కీలకమో.. కొన్ని దురలవాట్లకు దూరంగా ఉంచేలా చేయడం కూడా అంతకంటే ఎక్కువ అవసరం. ప్రస్తుతం ఎక్కువ మంది చిన్నారులకు దురలవాటుగా మారిన సెల్ ఫోన్ నుంచి ఈ వేసవి సెలవుల్లో దూరం చేసే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం ఉన్న అన్ని మార్గాలను అనుసరించాలి. తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పిల్లల కోసం కేటాయించి ఫోన్‌కు బదులు క్రీడా మైదానాలకు తీసుకునివెళ్లి ఆడించడమో, మరో పని చేయించడమో చేయాలి. తల్లిదండ్రులకు పిల్లలతో గడిపే అవకాశం లేకపోతే గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న నానమ్మ/అమ్మమ్మ, తాతయ్యల వద్దకు పంపించాలి. అక్కడ వారితో కొన్ని రోజులపాటు ఉండడం వల్ల అనేక విషయాలను తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని పరిస్థితులు, బంధాలు, ఇతర కుటుంబ సభ్యుల గురించి తెలుసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ సెలవుల్లో కొద్దిరోజులైనా కుటుంబ సభ్యులతో కలిసి ఉండేలా చేయడం అత్యంత కీలకం. పెద్దలతో పిల్లలు గడపడం ద్వారా నేర్చుకున్న అనేక విషయాలు వారి భవిష్యత్తు ఎదుగుదలకు నిచ్చెనలుగా ఉపయోగపడతాయి.

క్రీడలతో మనోవికాసం

చిన్నారుల్లో గడిచిన కొన్నాళ్లుగా శారీరక శ్రమ తగ్గిపోయింది. ఉదయం లేవడం.. స్కూల్‌కు వెళ్లడం, మళ్లీ రావడం హోమ్ వర్క్ చేయడమో.. సెల్ ఫోన్లతో గడపడం.. నిద్రపోవడం పరిపాటిగా మారింది. చాలామంది పిల్లలకు ఆటలంటే కూడా తెలియడం లేదు. అనేక పాఠశాలల్లో మైదానాలు కూడా లేవు. కాబట్టి ఈ వేసవి సెలవులను పిల్లలు ఆటల కోసం కేటాయించడం మంచిది. క్రికెట్, షటిల్, చదరంగం, టేబుల్ టెన్నిస్‌తో పాటు ఇతర క్రీడల్లో శిక్షణ ఇప్పించడం మం చిది. ఆటలతో శారీరక శ్రమ కలగడంతోపాటు మానసిక వికాసానికి దోహదం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

నైతిక విలువలను తెలియజేయాలి

చిన్నారులకు నైతిక విలువలను తెలియజేసేం దుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇందుకు నీతి సూక్తులు, నీతి కథలను చెప్పాలి. మంచి, చెడులు గురించి వివరించాలి. పెద్దల పెట్ల ఎలా వ్యవహరించాలో తెలియజేయాలి. ప్రస్తుతం ఎంతోమంది చిన్నారులకు మంచి, చెడుల మధ్య తారతమ్యం తెలియడం లేదు. బయట వారితో ఎలా మాట్లాడాల్లో కూడా తెలియడం లేదు. పెద్దలకు గౌరవం ఇవ్వాలన్న విషయాన్ని కూడా మరచిపోతున్నారు. ఇటువంటి ప్రాథమిక అంశాలపై అవగాహన కలిగించే ప్రయత్నం చేయాలి.

సృజనాత్మకతను తట్టిలేపాలి

చిన్నారుల్లో సృజనాత్మకతను తట్టిలేపే ప్రయత్నం చేయాలి. పజిల్స్, కొన్ని గేమ్స్‌ను ఆడించడం ద్వారా ఆలోచన సరళిని పూర్తిగా మార్చేందుకు ఆస్కారం ఉంటుంది. అబాకస్ వంటివి నేర్పించడం ద్వారా మంచి ఫలితం ఉంటుంది. చిన్నారుల ఆలోచనలను తట్టి లేపుతూ భిన్నమైన ప్రాజెక్టులు చేసేలా చూడాలి. వారి ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. చేసే పనిని వద్దని వారించే ప్రయత్నం ఈ సెలవుల్లో చేయకుండా ఉండడం మేలు.

ఆర్థిక పాఠం కూడా ముఖ్యమే..

ఆర్థిక అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించడం కూడా చాలా ముఖ్యం. ఆర్థిక క్రమశిక్షణ భవిష్యత్తులో వారి ఎదుగదలకు ఎంతగానో దోహదపడుతుంది. డబ్బులను ఆదా చేయడం, ఖర్చు పెట్టే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటివి చెప్పడంతో పాటు సాయం చేసే గుణాన్ని కూడా అలవరచాలి. ఆ సాయం కూడా పరిధికి మించి ఉండకూడదన్న విషయాన్ని పిల్లలకు ఇప్పటి నుంచే తెలియజేయడం అత్యంత కీలకం.

వీటికి ప్రాధాన్యం ఇవ్వాలి

ఆరోగ్యానికి సంబంధించి ప్రాధాన్యమిచ్చేలా పిల్లలకు అవగాహన కల్పించాలి. ఉదయాన్నే లేవడం, వాకింగ్ వంటివి చేసే అలవాటును నేర్పించాలి. అలాగే యోగా, ప్రాణాయామం వంటివి పిల్లలకు అలవరచాలి. ఉదయాన్నే లేవడాన్ని అలవాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వారికి చెప్పడంతో పాటు తల్లిదండ్రులు కూడా అలవాటు చేసుకోవాలి. స్వీయ రక్షణకు ఉపయోగపడే మార్షల్ ఆర్ట్స్ ఇతర కోర్సులను నేర్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పనులు చేసుకునేలా..

వేసవి సెలవుల్లో అనేక పనులను పిల్లలతోనే చేయించాలి. ముఖ్యంగా ఆడ పిల్లలకు ఇంట్లో కొన్ని రకాల పనులు చేసుకునే అలవాటు చేయాలి. ప్రస్తుతం చాలామందికి పనులు చేయడం కూడా తెలియడం లేదు. ఇది భవిష్యత్తులో కొన్ని రకాల ఇబ్బందులకు కారణం అవుతుంది. కాబట్టి చిన్న చిన్న పనులను వారితో చేయించాలి. సైకిల్‌ను క్లీన్ చేయించడం, ఇంట్లో ఉండే వస్తువులను శుభ్రం చేయించడం, పుస్తకాలను పరిశుభ్రంగా పెట్టుకునేలా చేయడం.. వంటి చిన్న చిన్న పనులు చేయించడం ద్వారా క్రమశిక్షణ అలవడుతుంది.

కొత్త కోర్సులు

పిల్లల ఇష్టాలకు అనుగుణంగా కొత్త కోర్సులు నేర్పించడం అవసరం. కొత్త భాషల పట్ల ఆసక్తిని కలిగించే ప్రయత్నం చేయాలి. కొత్త భాష నేర్చుకోవడం వల్ల మెదడు చురుగ్గా మారుతుంది. దీనివల్ల కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యేందుకు దోహదం చేస్తాయి.

ప్రత్యేక శిబిరాలు

నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో వేసవి సెలవుల నేపథ్యంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. క్రీడలతో పాటు డాన్స్, మ్యూజిక్ వంటి కోర్సులను ప్రత్యేకంగా నేర్పిస్తున్నారు. అనేక సూళ్లలో కూడా వేసవి ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. బయట నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో పిల్లలకు ఇష్టమైన వాటిలో చేర్పించవచ్చు.

క్రైం... crime news

యువతిని బెదిరించిన నయవంచకుడి అరెస్టు

సీతంపేట, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నివాస ఉంటున్న ఒక అమ్మాయిని మాయమాటలు చెప్పి పరిచయం చేసుకొని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించడంతో పటు నగ్న విడియోలు తీసి బ్లెక్ మెయిల్ చేసిన ఒక వ్యక్తిని నాలుగో పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో నివాసం ఉంటున్న ఒక అమ్మాయితో కొద్ది కాలం క్రితం అక్కయ్యపాలెంలో నివాసం ఉంటున్న రవీంద్ర యాదవ్ పరిచయం ఏర్పరచుకొని మాయమాటాలు చెప్పి పెళ్లి చేసుకొంటానన్ని నమ్మించాడు. అంతేకాకుండా ఆమెను బలవంతంగా అనుభవించి, నగ్న చిత్రాలు, వీడియోలను తీసి బ్లెక్ మెయిన్ చేయడం ప్రారంభించాడు. ఆమె వద్ద డబ్బులు తీసుకోవడమే కాకుండా, ఆమెను బూతులు తిడుతూ కులం పేరుతో దూషించి చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ సత్యనారాయణ విచారణ చేపట్టారు. కులం పేరుతో తిట్టడంతో ఈ కేసును ప్రత్యేకంగా ఏసీపీ విచారణ చేపట్టారు. విచారణ అనంతరం రవీంద్ర యాదవ్‌ను అరెస్టు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడి మృతి

ఆనందపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని మామిడిలోవ జాతీయ రహదారి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి చెందినట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు.మామిడిలోవ వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని, వెళ్లిపోయింది. ఈ సంఘటనలో వ్యక్తి శరీర భాగాలు నుజ్జునుజ్జు కావడంతో మృతదేహం పోల్చుకోలేని విధంగా తయారైంది. అయితే మృతి చెందిన వ్యక్తి యాచకుడిగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

నేపాల్‌లో అదృశ్యం.. విశాఖలో ప్రత్యక్షం



అన్సకాబమ్

గాజువాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లో అదృశ్యమైన ఓ యువతి విశాఖలో ప్రత్యక్షమైంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నేపాల్‌లోని కాట్‌మాండ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 11న తన కుమార్తె అన్సకాబమ్ (22) అదృశ్యమైనట్లు తండ్రి లాల్ బహదుర్భమ్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన నేపాల్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఆమె విశాఖలో ఉన్నట్టు గుర్తించారు. సోమవారం అక్కడ ఎస్ఐ అర్జున్, యువతి తండ్రి లాల్ బహదుర్భమ్ నగర పోలీస్ కమిషనర్‌ను కలిశారు. గాజువాక స్టేషన్ పరిధి తుంగ్లాం ప్రాంతంలో యువతి ఉన్నట్టు గుర్తించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గాజువాక ఎస్ఐ నజీర్‌తో పాటు కాట్‌మాండ్ స్టేషన్ ఎస్ఐ అర్జున్ గాలించి, ఆమెను పట్టుకుని తండ్రికి అప్పగించారు. యువతి దేశం దాటి ఎలా వచ్చిందన్న దానిపై స్పష్టత లేదు.

26 నుంచి వైఎంసీఏలో చిన్నారులకు సమ్మర్ క్యాంప్

- మే 31 వరకు నిర్వహణ

రామ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వైఎంసీఏ ఆధ్వర్యంలో పిల్లలకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తలిపారు. బీచ్‌రోడ్డు వైఎంసీఏలో గత 38 సంవత్సరాలుగా వేసవి సెలవుల్లో చిన్నారులుకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 26 నుంచి మే 31 వరకు నిర్వహించే సమ్మర్ క్యాంపులో 5 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు పాల్గొనవచ్చని తెలియజేశారు. అబాకస్, ఏరోబిక్స్, ఎయిర్‌గన్ రీఫిల్ షూటింగ్, చెస్ క్రికెట్, డ్యాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్ మ్యూజిక్ స్కేటింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వివరాల కోసం ఫోన్ : 8297223480/ 9908079791లో సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే 28 నుంచి సమ్మెకు దిగుతాం

- ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు పర్యవేక్షించే ఫీల్డ్ అసిస్టెంట్లు (క్షేత్రస్థాయి సహాయకులు) తమ సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. చాలీచాలని గౌరవవేతనంతో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సంబంధించి మంగళవారం విజయవాడలో ఉన్నతాధికారులు చర్చలకు ఆహ్వానించారని, ఒకవేళ చర్చలు సఫలం కాకుంటే 28వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని పేర్కొన్నారు. కాగా జిల్లాలోని నాలుగు మండలాల్లో 76 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో సగటున ఏడాదికి 7,500 పని దినాలు పూర్తి చేసే బాధ్యత వీరిదే. వేసవిలో ఎక్కువ పని దినాలు చేసే క్రమంలో వారు సమ్మెకు దిగితే ఇబ్బందులు తలెత్తుతాయి. ఫీల్డ్ అసిస్టెంట్లకు గౌరవవేతనం కింద నెలకు రూ.ఆరు వేలు,పంచాయతీల స్థాయిని బట్టి ఇన్సెంటివ్‌తో కలిపి రూ.8వేల నుంచి రూ.12 వేల వరకు వస్తుందని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ప్రతినిధి ఒకరు తెలిపారు. గౌరవ వేతనం పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నదే తమ ప్రధాన డిమాండ్లని పేర్కొన్నారు.

27 నుంచి అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో జరిగే వార్షిక ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 27 నుంచి మే 2వ తేదీ వరకూ ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఈఓ కె. సుబ్బారావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 27న గంధం అమావాస్య, 28 నుంచి మే 2 వరకు రామానుజాచార్యుల తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశామన్నారు.

25న జాబ్‌మేళా

కంచరపాలెం ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం బాలికల ఐటీఐ ప్రక్కన గల నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 25న (శుక్రవారం) జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉప ప్రాంతీయ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టల శ్యాంసుందర్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో నవత ట్రాన్స్‌పోర్ట్, టాటా టొయో రేడియేటర్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. క్లర్క్, ఐటీ, హార్డ్‌వేర్ టెక్నీషియన్, టెక్నీషియన్ తదితర ఉద్యోగాలను భర్తీచేయనున్నారు. ఐటీఐ, ఇంటర్,డిప్లొమా, డిగ్రీ పాసైన యువత హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.3 లక్షలు నుంచి రూ.1.8 లక్షలు వేతనం చెల్లించే ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు ముందుగా నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే శుక్రవారం ఉదయం 10గంటలకు అన్నీ ధ్రువపత్రాలతో హాజరుకావాలని శ్యాం సుందర్ కోరారు.

ఎన్‌హెచ్-16 డిప్యూటీ కలెక్టర్‌గా జ్ఞానవేణి



కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా జ్ఞానవేణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆమె కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలెక్టరేట్‌లో కలిసి అభివృద్ధి పనులను వివరించారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు సర్వే జరుగుతుందని పేర్కొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 402 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను అధికారులు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 402 వినతులను స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి 173, జీవీఎంసీకి సంబంధించి 110, పోలీసు విభా గానికి 36, ఇతర విభాగాల నుంచి 83 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న వినతులపై అధికారులతో సమీక్షించారు. ప్రతిరోజూ శాఖాపరమైన సమీక్షలు జరిపి, దశల వారీగా అర్జీలను పరిష్కరించాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులు మళ్లీ మళ్లీ వస్తే అందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వినతుల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పరిష్కరించిన వాటి ఫీడ్ బ్యాక్‌ను. మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్ఓ భవానీ శంకర్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి 73 వినతులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కు 73 వినతులు అందినట్టు అదనపు కమిషనరు డీవీ రమణమూర్తి తెలిపారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు నగరవ్యాప్తంగా వివిధ సమస్యలపై 73 వినతులు వచ్చాయని, వీటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా విజేతలకు బహుమతులు





ద్వితీయ బహుమతి గ్రహీత బి.గోవింద్‌సింగ్‌కు రిఫ్రిజిరేటర్‌ను, తృతీయ బహుమతి గ్రహీత బి.శివసుందర్‌రావుకు ఎల్ఈడీ టీవీని అందజేస్తున్న 'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు. చిత్రంలో డీసీఎం బీవీవీ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాఠకుల కోసం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'కార్ అండ్ బైక్ రేస్' లక్కీ డ్రా (విశాఖపట్నం యూనిట్ స్థాయి)లో ద్వితీయ బహుమతి పొందిన కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన బి.గోవింద్‌సింగ్‌కు రిఫ్రిజిరేటర్‌ను సోమవారం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు అందజేశారు. అలాగే తృతీయ బహుమతి సాధించిన ఎంవీపీ కాలనీకి చెందిన బి.శివసుందర్‌రావుకు ఎల్ఈడీ టీవీని అందించారు. విజేతలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్ విభాగం డీసీఎం బీవీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా క్యూలైన్ల ఏర్పాటు

- అధికారులతో చర్చించిన ఈఓ

సింహాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి ఈనెల 30న జరగనున్న చందనోత్సవం నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్టు ఈఓ కె. సుబ్బారావు తెలిపారు. సోమవారం ఆయన క్యూలైన్ల ఏర్పాటుపై గోపాలపట్నం శాంతిభద్రల విభాగం సీఐ గొలగాని అప్పారావుతో కలిసి చర్చించారు. దేవస్థానం ఈఈ డిజి శ్రీనివాసరాజు ఇప్పటికే క్యూలైన్ల ఏర్పాటుపై ప్రణాళిక సిద్ధం చేశారు. వాటిని ఈఓతో కలిసి సీఐ క్షేత్ర పరిశీలన చేశారు. ముఖ్యంగా సాధారణ భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కలిగే విధంగా క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ప్రముఖుల దర్శనాల వల్ల భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా అంతరాలయ దర్శనాల విషయంలో ముందస్తుగా సమయాలను ప్రకటించాలని, దానికి అనుగుణంగా దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు తొలి దర్శనం తరువాత సీఎం, మం త్రులకు దర్శనం కల్పించాలని భావిస్తున్నారు. తరువాత న్యాయమూర్తులు, ప్రోటోకాల్ టికెట్లు కొనుగోలు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులను ఉదయం 5 గంటల వరకు అంతరాలయంలోకి పంపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు తగినరీతిలో ఆలయంలో ఆరు క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 5 గంటల తరువాత అంతరాలయ దర్శనాలు పూర్తిగా నిలిపివేయాలని యోచిస్తున్నారు. అలాగే ఉచిత, రూ.300, రూ.1000, రూ.1500 టికెట్ల క్యూలైన్ల నిడివిని పెంచడంతో పాటు ఎండ నుంచి ఉపశమనం కలిగేలా టెంట్లు, తాగునీటి సౌక ర్యం కల్పించనున్నారు.

పాడైన టమాటా సరఫరా

డ్వాక్రా మహిళల ఆందోళనతో దిగి వచ్చిన అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో డ్వాక్రా మహిళల ఆందోళనతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు దిగి వచ్చారు. పాడైన టమాటాకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు గత నాలుగు నెలల నుంచి చిత్తూరు నుంచి టమాటాను తెప్పించి రైతు బజార్లలో విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. అక్కడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం చిత్తూరులో కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నారు. అంత దూరం నుంచి తెచ్చిన టమాటాలు చాలా వరకు పాడైపోతున్నాయి. అయితే అటువంటి వాటిని కూడా క్రేట్లతో తూకం వేసి డ్వాక్రా మహిళలకు అంటగడుతున్నారు. కిలోకు మూడు రూపాయలు లాభం వచ్చినా రోజుకు 30 నుంచి 40 కిలోలు పాడైపోవడంతో రూ.500 నుంచి 800 వరకు వారు నష్టపోతున్నారు. సోమవారం కూడా ఇలాగే జరిగింది. ఎంవీపీ కాలనీ, పెందుర్తి రైతుబజార్లకు సరఫరా చేసిన టమాటాలు బాగా దెబ్బతినడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో డ్వాక్రా మహిళలు ఆందోళన చెందుతూ ఈ విషయాన్ని ఎస్టేట్ అధికారులు తెలియజేశారు. వెంటనే వారు గోపాలపట్నంలోని అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయానికి ఫోన్ చేసి చెప్పడంతో అక్కడ నుంచి సీనియర్ అసిస్టెంట్‌ను బజార్లకు పంపారు. పాడైన టమాటాలను తూకం వేసి, వాటికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పడంతో డ్వాక్రా మహిళలు ఊపిరి పీల్చుకున్నారు. ఇతర బజార్లలో కూడా ఇలా పాడైన టమాటాకు మినహాయింపునివ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. టమాటా ధర తగ్గిపోయిందని, అందువల్ల చిత్తూరు నుంచి తెప్పించాల్సిన అవసరం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని అధికారులు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.





పాడైన టమోటాను చూపిస్తున్న డ్వాక్రా మహిళలు